01ATP01F_01ATP01F.qxd 01-03-2026 PM 10:48 Page 1






అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

సోమవారం 02 మార్చి 2026 పేజీలు : 04


# హంస వాహనంపై శ్రీవారి విహారం



హంస వాహనంపై భక్తులకు దర్శనం ఇస్తున్న శ్రీవారు

**కదిరి, మార్చి 1 ప్రభాతవార్త**

ప్రముఖ ప్రసిద్ధి గాంచిన శ్రీమత్‌ఖాద్రి లక్ష్మినరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారు హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నిత్యపూజ హోమం, అనంతరం శ్రీవారిని మడ వీధుల్లో ఊరేగించారు. సంధ్య సమయంలో శ్రీవారు జ్ఞాన నరసింహుడుగా హంస వాహనంపై తిరువీధుల్లో విహరించారు. కళ్యాణోత్సవం అనంతరం మొదటి రోజు శ్రీవారు తిరువీధుల్లో విహరించడానికి బ్రహ్మదేవుడు తన వాహనమైన హంసను నరసింహుడుకి వాహనంగా మారుస్తాడని భక్తుల నమ్మకం. అదే విధంగా మరో ప్రాసస్త్యం ఉంది. హంస పాలను నీటిని ఎలా వేరు చేస్తుందో అలాగే మహావిష్ణువు అవతారమైన నరసింహుడు భక్తుల్లోని మంచి చెడులను వేరు చేసి మంచిని మాత్రమే స్వీకరిస్తారని భక్తుల నమ్మకం. శ్రీవారిని దర్శించుకోవడానికి పట్టణం నుంచి కాక వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున విచ్చేస్తారు. ఈ ఉత్సవానికి ఉభయ దారులుగా రాజగోపాల్‌శెట్టి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. నేడు సింహవాహనంపై శ్రీమత్‌ఖాద్రి లక్ష్మినరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా నేడు సోమవారం స్వామివారు సింహవాహనంపై తిరువీధుల్లో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.

# రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్ట్‌పై ప్రజా ఉద్యమం చేపట్టాలని వైసీపీ నిర్ణయం

**- కడపలో రాయలసీమ లిఫ్ట్‌పై భవిష్యత్ కార్యాచరణ సమావేశం - వైసీపీ సమన్వయకర్తలు భేటీ**



సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి

**అనంతపురం, మార్చి 1 ప్రభాతవార్త బ్యూరో**

రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పూర్తి చేయాలన్న డిమాండ్‌తో ఆదివారం కడపలోని మేడా కన్వెన్షన్ హాల్‌లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కీలక సమావేశం నిర్వహించారు. వైసీపీ రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, రీజనల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో పాటు రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల వైసీపీ అధ్యక్షులు, వైసీపీ సమన్వయకర్తలు, నాయకులు హాజరయ్యారు. కడప ఎంపీ అవినాష్ రెడ్డి, వైసీపీ సీమ నేతలు అనంత వెంకట్రామిరెడ్డి, డాక్టర్ శైలజనాథ్, గోరంట్ల మాధవ్, కాటసాని రాంభూపాల్ రెడ్డి, బి.వై.రామయ్య, ఎస్వీ మోహన్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ను ప్రజా ఉద్యమంగా మార్చాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి భవిష్యత్ కార్యాచరణ, ఉద్యమ రూపకల్పనపై చర్చించారు. కృష్ణా జలాల పరివాహక ప్రాంతానికి చంద్రబాబు చేస్తున్న ద్రోహాన్ని కలిసికట్టుగా తిప్పికొడదామని నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ..రాయలసీమ ప్రాంతం దశాబ్దాలుగా సాగు, తాగునీటి కష్టాలు ఎదుర్కొంటోందన్నారు. ఇక్కడ వలసలు, రైతుల ఆత్మహత్యలు ఆపడం కోసం ఎంతో మంది పోరాటాలు చేశారని గుర్తు చేశారు. దాని ఫలితంగానే నాగార్జున సాగర్, శ్రీశైలం, ఎస్ఆర్‌బీసీ, తెలుగు గంగ, హెచ్ఎన్ఎస్ఎస్, జీఎన్ఎస్ఎస్ వంటి ప్రాజెక్టులు వచ్చాయని తెలిపారు. కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ ప్రభుత్వాలు అక్రమంగా ప్రాజెక్టులు కడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తోందన్నారు. కర్ణాటక ప్రభుత్వం ఆల్మట్టి డ్యాం ఎత్తును పెంచి 129 టీఎంసీల సామర్థ్యాన్ని ఏకంగా 229 టీఎంసీలకు పెంచుతున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ ప్రభుత్వం శ్రీశైలం నుంచి రోజుకు 8 టీఎంసీలు తీసుకెళ్తోందన్నారు. ఇలాంటి తరుణంలో పోరాడాల్సిన ప్రభుత్వం చూసీచూడనట్లు వ్యవహరిస్తోందని తెలిపారు. చంద్రబాబుకు రాష్ట్ర ప్రయోజనాల కన్నా వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాలే ఎక్కువయ్యాయని ఆరోపించారు. ఇలాంటి తరుణంలో ప్రజలే పోరాటాలు చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని తెలిపారు. గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉంటూనే పోరాటాలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దూరదృష్టితో రాయలసీమ ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుడితే చంద్రబాబు సీఎం అయ్యాక ఈ పథకానికి సమాధి కడుతున్నారని మండిపడ్డారు. శ్రీశైలం నుంచి రోజుకు 3 టీఎంసీలు చొప్పున తీసుకెళ్లేలా రాయలసీమ లిఫ్ట్‌ను రూపొందించినట్లు తెలిపారు. 2024 వరకు రాయలసీమ లిఫ్ట్ పనులు కొనసాగాయని, చంద్రబాబు సీఎం అయ్యాక పనులు ముందుకు సాగలేదన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఒత్తిడి చేయడంతో ఎన్జీటీ అనుమతి వచ్చిన తర్వాత పనులు చేస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు శాసనమండలిలో ఇటీవల ప్రకటన చేశారన్నారు. ఎన్జీటీ అనుమతితోనే కర్ణాటకలో ఆల్మట్టి, తెలంగాణలో ప్రాజెక్టులు కట్టడం లేదని అనంత వెంకటరామిరెడ్డి గుర్తు చేశారు. 2022లో ఎన్జీటీ అభ్యంతరాలు చెప్పినా రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్ట్ పనులు ఆపలేదన్నారు. కూటమి ప్రభుత్వం తక్షణం రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులు పునఃప్రారంభించి ఎన్జీటీ అనుమతులు తీసుకురావాలన్నారు.

## హంద్రీనీవా సామర్థం 11,500 క్యూసెక్కులకు పెంచాలి

హంద్రీనీవా సుజల స్రవంతి పథకం కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి, చిత్తూరు జిల్లాలకు కీలకమని అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. హంద్రీనీవా సామర్థ్యాన్ని 11500 క్యూసెక్కులకు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం 3850 క్యూసెక్కుల సామర్థం మాత్రమే ఉండడంతో ఒక టీఎంసీ డ్రా చేయడానికి నాలుగు రోజులు పడుతోందని చెప్పారు. శ్రీశైలానికి వరద నీరు 40 రోజులు మాత్రమే వస్తున్న నేపథ్యంలో ఆ 40 రోజుల్లో 40 టీఎంసీలు తీసుకెళ్లాలంటే హంద్రీనీవా సామర్థం 11500 క్యూసెక్కులకు పెంచాలన్నారు. అప్పుడే రాయలసీమకు ప్రయోజనం కలుగుతుందని తెలియజేశారు. గ్రేటర్ రాయలసీమకు సాగు, తాగునీటి కోసం పోరాటాలు చేయాల్సిన సమయం వచ్చిందని, గ్రామగ్రామాన ప్రజలను చైతన్యవంతులను చేసి కూటమి ప్రభుత్వం మెడలు వంచుదామని పిలుపునిచ్చారు.

# 80 కుటుంబాలు టీడీపీలోకి చేరిక

**- వైసీపీకి షాక్ - సొంతగూటికి పద్మనాభరెడ్డి చేరిక - పద్మనాభరెడ్డి వెంట ఎర్రబల్లిలో 80 కుటుంబాలు టీడీపీలోకి చేరిక**

**- జగన్ హయాంలో ప్రజలకు ఒరిగింది ఏమి లేదు - 11 సీట్లకే వైసీపీని పరిమితం చేశారు ప్రజలు**




కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి సవితమ్మ, టిడిపిలో చేరిన వారు

**గోరంట్ల, మార్చి 1 ప్రభాతవార్త**

స్థానిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని మంత్రి సవితమ్మ ముందస్తుగా రచిస్తున్న పద్మవ్యూహంలో భాగంగా గోరంట్ల మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నార్సింపల్లి పంచాయతీ పరిధిలోని ఎర్రబల్లి గ్రామానికి చెందిన పద్మనాభరెడ్డి ఆదివారం మంత్రి సవితమ్మ సమక్షంలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకోవడం జరిగింది. దీంతో వైసీపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. గోరంట్ల మండలంలో వైసీపీకి చెందిన 80 కుటుంబాలు రాష్ట్ర బిసి సంక్షేమ, చేనేత జౌళి శాఖామంత్రి ఎస్.సవితమ్మ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరాయి. ఈ కార్యక్రమంలో నార్సింపల్లి పంచాయతీ ఎర్రపల్లి వైసీపీ నాయకుడు పద్మనాభరెడ్డి, ఎంపిటిసి తిప్పమ్మతో పాటు మరికొంత మంది ప్రముఖులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీ కండువా కప్పి వారిని మంత్రి సవితమ్మ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ కాలంలో గోరంట్ల ప్రాంతంలో అభివృద్ధి పూర్తిగా స్తంభించిపోయిందని విమర్శించారు. రైతులకు, మహిళలకు, యువతకు సరైన ప్రోత్సాహం లేకపోయిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేసిందని, వ్యవసాయ రంగంలో అభివృద్ధి శూన్యమన్నారు. జగన్ హయాంలో ప్రజలకు ఒరిగింది ఏమి లేదని, జనాలకు డబ్బులు ఇస్తే ఓట్లు వేస్తారు అనుకున్నాడని 11 సీట్లకే వైసీపీని పరిమితం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని రంగాల్లో అభివృద్ధి వేగవంతమైందని, నియోజక వర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు మెరుగుపడుతున్నాయని పార్టీ లోకి చేరిన వారు తెలిపారు. అభివృద్ధి చేస్తున్న కూటమి ప్రభుత్వానికి మంత్రి సవితమ్మకు అండగా నిలుస్తామని కొత్తగా చేరిన కుటుంబాల వారు పేర్కొన్నారు. ప్రజల ఆశీస్సులతో పెనుకొండ నియోజకవర్గం మరియు గోరంట్లను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళతామని మంత్రి సవితమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి, జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి నరేష్, స్టేట్ డైరెక్టర్ సోమశేఖర్, సుబ్బారెడ్డి, రాగి మేకలపల్లి గంగాధర్‌రెడ్డి, నాగేనాయక్, రాజారెడ్డి, పచ్చ అశోక్, గుమ్మయ్యగారిపల్లి హరి, పసుపులేటి శ్రీనివాసులు, చింతా రామచంద్రారెడ్డి, సర్పంచు నం సింహమూర్తి, చింతా భాస్కర్‌రెడ్డి, కురుబ మల్లికార్జున, సుభహన్, నిడి మామిడి, సింగిల్ విండో అధ్యక్షులు రవిమోహన్, సోమిరెడ్డి,పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్సు - కారు ఢీకొన్న ఘోర ప్రమాదం



రోడ్డు ప్రమాదములు మృతి చెందిన కర్ణాటక వాసులు

**కళ్యాణదుర్గం, మార్చి 1 ప్రభాతవార్త**

**: ముగ్గురు దుర్మరణం**

కళ్యాణదుర్గం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గూబనపల్లి గ్రామం సమీపంలో ఆదివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, అనంతపురం నుండి రాయదుర్గం వైపు వెళ్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ) బస్సు ఎదురుగా వస్తున్న కర్ణాటక రాష్ట్రానికి చెందిన కారును ఢీకొంది. ఢీకొనడంతో కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జైంది. కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు పురుషులు, ఒక మహిళ తీవ్ర గాయాలపాలై ఘటనా స్థలంలోనే మృతి చెందారు. ప్రమాద తీవ్రత దృష్ట్యా స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుల వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ ప్రమాదంతో ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# కాసులు వదలడు..కనికరం చూపడు

**- వివాదాలకు కేంద్రం..ఆ తహసీల్దార్ కార్యాలయం**
**- ఆ అధికారి తీరు..అన్నదాతలు బేజారు..**
**- అనుబంధ శాఖల అధికారులకూ తప్పని అవస్థలు**




**తాడిపత్రి, మార్చి1, ప్రభాతవార్త**

తాడిపత్రి ప్రాంతంలోని ఓ మండల రెవెన్యూ అధికారి భూ దస్త్రాలు తారుమారు చేస్తూ, అన్నదాతలను అవస్థలకు గురిచేస్తూ వివాదాలకు కేంద్రంగా మారుతున్నాడు. కాసుల కోసం కక్కుర్తిపడి వివాదాలు సృష్టిస్తున్నాడు. సాంకేతికంగా హద్దులు, సర్వే నంబర్లు, పట్టాదారుల పేర్లలో తప్పులు నమోదైతే సరిదిద్దాల్సిన ఆ అధికారే అక్రమాలకు పాల్పడుతున్నాడని రైతులు ఆరోపిస్తున్నారు. ఇతర మండలాలతో పోల్చితే ఆ మండలంలోనే ఇలాంటి వివాదాలు అధికమవడంతో బాధితుల సంఖ్య కూడా రోజు రోజుకు పెరుగుతోంది. ఆ మండలంలో తన భూములున్న ఆర్డీవో కార్యాలయంలోని ఓ అధికారి ఈ అధికారి తప్పులను ఉన్నతాధికారుల దృష్టికి పోకుండా కాపాడుతున్నాడనే వాదనలు రెవెన్యూ వర్గాల్లోనే ఎక్కువగా వినిపిస్తోంది. ఆ మండలంలో బాధ్యతలు చేపట్టిన మొదట్లో ఆ రెవెన్యూ అధికారి కొందరు అక్రమాల ఘనుల అడుగులకు మడుగులొత్తే పనులు చేయడంతో వాటిని అడ్డుపెట్టుకొని నిత్యం ఆ అక్రమార్కులు ఆ అధికారి చెంతనే ఉంటూ మరిన్ని అక్రమాలు చేయిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. కాసులు వదలడు..కనికరం చూపడు అనే నానుడితో మండల వ్యాప్త ప్రజలు ఆ అధికారిని వర్ణిస్తున్నారంటేనే ఆ అధికారి తీరు ప్రజలను ఎంతగా వేదిస్తోందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.కాసులతో పనులు జరుపుకునే వారికి ఆ అధికారి ఓ కల్పతరువు లాంటి వాడని జనం చర్చించుకోవడం విశేషం.

**:ఆయన తీరుకు నిదర్శనాలు కొన్ని..!**

ఓ ఫ్యాక్టరీకి సమీపంలో ఉన్న గ్రామంలో ఓ దళిత మహిళ ఏళ్ల తరబడి సర్వే నం.214లోని బంజరు భూమిని సాగు చేసుకుంటోంది. ఆర్‌హెచ్‌లో తమ కుటుంబ పెద్ద పేరు ఉందని, తాను ఆ కుటుంబ పెద్దకు వారసురాలినని, అనుభంలో కూడా తానే ఇప్పటికి ఉన్నానని, వీటన్నింటిని పరిగణలోకి తీసుకొని సదరు భూమిని తనపేర ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులందరి చుట్టూ తిరిగింది. మొదట నీదే న్యాయం..నీకే చెందుతుందని ఆమెతో చెప్పిన ఆ అధికారి ఆ భూమి పక్కనే ఉన్న మరో వ్యక్తి ఆశల వల విసరగానే వారితో తనకు వ్యతిరేకంగా కోర్టులో కేసు వేయించినట్లు బాధితురాలు ఆరోపిస్తోంది. ఆ బాధిత మహిళ ఈ తతంగమంతా తమ సామాజిక వర్గానికి చెందిన ఓ రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారి దృష్టికి తీసుకొని పోవడం, ఆ మహిళకు న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించడం, జిల్లాలోని అధికారులు ఆ మండల అధికారికి షోకాజ్ నోటీసులు జారీ చేయడం చకచకా జరిగిపోయాయి. కానీ నేటికీ ఆమెకు న్యాయం జరగకపోవడం గమనార్హం.

:జాతీయ రహదారికి దగ్గరగా ఉన్న మరో గ్రామంలో రెండు దళిత కుటుంబాలు సర్వే నం.139, 140లలోని భూములను చాలా ఏళ్లుగా సాగు చేసుకుంటున్నాయి. ఆ సర్వే నంబర్లకు సంబంధించిన ఆర్‌హెచ్‌లో తన సామాజిక వర్గానికి చెందిన మరొకరి పేరు ఉందని...వారికి ఈ భూములు దక్కేలా పావులు s´ ది ఎ¯ డ´ నే విమర్శలున్నాయి. ప్రస్తుతం అ న´ ం బ, ´ వ ం లో ఉన్న..అక్షరజ్ఞానం లేని దళితులకు కొంత సొమ్ము ముట్టచెప్పేలా ఆ అధికారి పరోక్ష సహకారం అందించాడని, పనిలో పనిగా తన జేబు కూడా బాగానే నింపుకున్నాడనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ విషయం తెలుసుకున్న దళిత కుటుంబాలకు చెందిన చదువుకున్న యువకులు రంగంలోకి దిగి తమ భూమిని తాము కాపాడుకునే ప్రయత్నం ముమ్మరం చేశారు. ఆ అధికారి కార్యాలయం ముందు ధర్నాకు కూడా దిగారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఓ పై అధికారిని విచారణకు పంపారు. ఆర్‌హెచ్‌లో పేరున్న వ్యక్తులకు సదరు భూమిని కట్టపెట్టడం లేదని ఒకవైపు చెబుతూనే..ఆ వ్యక్తులను తన పై అధికారి కార్యాలయానికి స్వయంగా ఆ అధికారే తీసుకొని పోయి అనుకూలంగా పనులు చక్కపెడుతున్నాడనే అభిప్రాయాన్ని బాధితులు వ్యక్తం చేస్తుండటం విశేషం.

:ఒక సామాజిక వర్గం ప్రాబల్యం ఎక్కువగా ఉన్న గ్రామంలోని కొండ ప్రాంతంలో కొందరు వ్యవసాయ కూలీలు భూమిని సాగు చేసుకుంటున్నారు. అన్ని శాఖల అధికారులు వారిని అన్ని విధాలా అడ్డుకున్నా పట్టువీడకుండా చాలా వరకు పోరాడి సదరు భూమిని చదును చేసుకునే స్థితికి తీసుకొని వచ్చారు. ఆ మండల అధికారి తన తప్పులకు సంబంధించి పెద్ద సంఖ్యలో ఆ వ్యక్తులు ఆధారాలు సేకరించారని తెలిసి, ఆ భూమిలో అసైన్డ్ చేయడానికి అనధికారికంగా అంగీకరించాడు. ఇంతలో ఓ చోటా నాయకుడు రంగప్రవేశం చేయడం, అది రచ్చకెక్కడంతో తిరిగి ఆ అధికారి మరో అక్రమార్కున్ని రంగంలోకి దింపి తమ గ్రామంలోని పశువుల పశుగ్రాసానికి ఇబ్బందులు ఎదురవుతాయని వినతులు సేకరింపజేసి మళ్లీ అడ్డంకులు సృష్టించాడని బాధితులు వాపోతున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఆయన అవినీతికి తార్కాణాలు కొండవీటి చాంతాడంత ఉంటాయనే వాదనలు మండలంలో విస్తృతంగా వినిపిస్తున్నాయి.

:ఇక మండలంలోని ప్రజల నుంచి భూముల వివాదాలకు సంబంధించిన సమస్యలు కాని, గ్రామ కంఠాలకు సంబంధించిన సమస్యలు కాని వస్తే పోలీసు, పంచాయతీ రాజ్ శాఖ అధికారుల నెత్తిన రుద్ది చేతులు దులుపు కుంటున్నారని ఆ అధికారి తీరుపై ఆయా శాఖల అధికారులు గగ్గోలు పెడుతున్నారు. దీంతో పల్లెల్లోని భూ, స్థలాల సమస్యలకు మరింత అగ్గిరాజేసినట్లు అవుతోంది. ఆ అధికారి కోర్టుల్లో ఉన్న వ్యాజ్యాలను కాని, వివాదాలను కాని లెక్కచేయడని, కాసులిస్తే చాలు అడ్డదారిలో ఆ సమస్యలకు సాకులు వెతుకుతాడనే చర్చ సర్వత్రా సాగుతోంది.

ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో విచారించి ఇప్పటికైనా ఆ అధికారిపై తగిన చర్యలు తీసుకోవాలని మండల వ్యాప్త ప్రజలు కోరుతున్నారు.

# ఉద్యమానికి శ్రీకారం చుడదాం..!



మాట్లాడుతున్న రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

- అనంతపురం జిల్లాను నిర్లక్ష్యం చేస్తున్నారు..!
- చంద్రబాబు తప్పుడు మాటలతో రైతంగాన్ని పదేపదే మోసం చే స్తున్నాడు.!
- రాయలసీమకు జరుగుతున్న అన్యాయంపై గ్రామ గ్రామాన గొంతుకై వినిపిస్తాం..!
- కాంట్రాక్టర్ల కోసమే చంద్రబాబు ప్రాజెక్టులు తీసుకొస్తాడు. నీళ్లు ఇవ్వాలినే ఆలోచన ఉండదు..!
- ఉన్న ప్రాజెక్టులు పూర్తి చేసి తర్వాత కొత్త ప్రాజెక్టుల గురించి ఆలోచించు చంద్రబాబూ..!
- మనం అతి పెద్ద మోసగాడిని ఎదుర్కొంటున్నాం ఆయనతో పాటు ఆయన మీడియా సంస్థలను ఎదుర్కొంటున్నాం..!
- మోసం చేస్తూ పెద్ద ఎత్తున అపద్దాలను ప్రచారం చేస్తున్నారు. మోసపోయిన వాళ్లను మళ్లీ మోసం చేస్తున్నారు..!
- రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ను స్వయంగా చంద్రబాబు ఆపించి దానిపై ఆధారపడ్డ 10 లక్షల ఎకరాల ఆయకట్టుదారులను మోసగించాడు..!
- ఈ ప్రాంత ప్రజలకు మోసం చేయొచ్చనే నమ్మకాన్ని చంద్రబాబుకు మనమే కల్పిస్తూ వస్తున్నాం.

**రాప్తాడు, మార్చి 1 ప్రభాతవార్త**



కడపలో జరిగిన రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్ట్ ఉద్యమ కార్యాచరణ సదస్సులో రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గం సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ప్రాజెక్టుల పేరుతో చంద్రబాబు చేస్తున్న మోసాలను ప్రజలకు తెలియజేసేందుకు ఉద్యమానికి శ్రీకారం చుడదామని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పిలుపునిచ్చారు. రాయలసీమ ఎత్తిపోతుల పథకాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆదివారం కడపలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కోఆర్డినేటరు సజ్జల రామకృష్ణారెడ్డి, రీజనల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ అవినాష్ రెడ్డితో పాటు అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల నుంచి వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ను స్వయంగా చంద్రబాబు ఆపించి దానిపై ఆధారపడ్డ 10లక్షల ఎకరాల ఆయకట్టుదారులను మోసగించాడు. చంద్రబాబు అనంతపురం జిల్లాను నిర్లక్ష్యం చేస్తున్నారు. రాయలసీమకు జరుగుతున్న అన్యాయంపై గ్రామ గ్రామాన గొంతుకై వినిపిస్తాం. ఉమ్మడి ఏపీలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అనేక ప్రాజెక్టులను తీసుకొచ్చాడు. గ్రేటర్ రాయలసీమ పరిధిలోని ప్రాజెక్టులను చిత్తశుద్ధితో పూర్తి చేసేందుకు అవవసరమైతే లక్ష కోట్లు ఖర్చు చేసేందుకు కూడా వెనుకాడమని స్పష్టమైన హామీ ఇస్తే ఇంటింటికీ వెళ్లి చెబుతాం. అనంతపురం జిల్లాలో హెచ్ఎల్‌సీ మోడలైజేషన్ పూర్తికాలేదు. తుంగభద్ర ప్రాజెక్టు నుంచి హక్కుగా తీసుకోవాల్సిన నీటిని నేటికీ తీసుకోలేక పోతున్నాం. ప్రాజెక్టులంటే డ్యాంలు కట్టడం, మెయిన్ కాలువలు తీసుకురావడమేనా..? డిస్ట్రిబ్యూటరీల నిర్మాణం కాదా..? ప్రతి ఎకరాకు నీళ్లిచ్చే బాధ్యత లేదా? పూర్తిస్థాయిలో ఆయకట్టు దారులకు నీళ్లిస్తేనే కదా? ప్రాజెక్టు లక్ష్యం పూర్తిస్థాయిలో చేరినట్లు. రాయలసీమలో ఏ ప్రాజెక్టులో ఆయకట్టు వ్యవస్థ నిర్మాణం పూర్తయిందో చెప్పండి, హంద్రి-నీవా కాలువకు ఒక టీఎంసీ సామర్థం పెంచుతూ వైండనింగ్ చేయాలి. గాలేరు-నగరి ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలి. రాయలసీమ ప్రాజెక్టులకు సంబంధించి ఆయకట్టు నిర్మాణాలు చేపట్టే అంశంలో చంద్రబాబు చిత్తశుద్ధి చూపించాలి. ఆ తర్వాతనే మరో స్కీం ప్రకటించు. అంతేకాని 25 ఏళ్ల కిందట ప్రకటించిన ప్రాజెక్టులే చాలా వరకు పూర్తికాలేదు. తిరుపతి లడ్డూ విషయంలో చంద్రబాబు ఎంత పెద్ద ఎత్తున దుస్ప్రచారం చేశాడో ప్రజలందరికీ తెలుసు. ప్రపంచ వ్యాప్తంగా తెలుగు ప్రజల మనోభావాలను గాయపరిచేలా వ్యవహరించాడు. లడ్డూకు ఉపయోగించే నెయ్యిలో ఎలాంటి కల్తీ జరగలేదని సిట్ స్పష్టమైన రిపోర్టు ఇచ్చినా ఇంకా కల్తీ వ్య వహారాన్ని ముందుకు తీసుకెళ్తున్నాడు. టాయిలెట్లకు వినియోగించే యాసిడ్ వాడారనే ప్రచారం చేస్తున్నాడంటే ఎంత కండకావరమంటారో ఇంకేమైనా అంటారో అర్థం కావడం లేదు. - ఇంకా ముందుకెళ్లి శివుని మెడలో ఉన్న పామును ఏమి చేయాలో అది చేస్తానంటూ మాట్లాడాడు. పూజించాల్సిన నాగదేవతను కూడా నేను హెచ్చరిస్తున్నా ఏమైనా చేస్తానని మాట్లాడుతున్నాడంటే దేవుడికంటే గొప్పవాడిననే ఫీలింగ్‌లో ఉన్నాడా? దేవుళ్లకు దిక్కు లేకపోతే ప్రాజెక్టులకు దిక్కుందా? ఆయన ఏమి చేయాలనుకున్నాడో అది చేస్తూ ముందుకెళ్తున్నాడు. అమరావతి పేరుతో ఉమ్మడి 13 జిల్లాల్లోని సంపదంతా తీసుకెళ్లి అక్కడ పెట్టుబడులు పెడుతున్నాడు. దాదాపు 17 నెలల్లోనే 3 లక్షల కోట్లు అప్పులు తెచ్చి రికార్డు సృష్టించాడు. ఉన్న ప్రాజెక్టులు పూర్తి చేసిన తర్వాత కొత్త ప్రాజెక్టుల గురించి ఆలోచించు చంద్రబాబూ. మనం అతి పెద్ద మోసగాడిని ఎదుర్కొంటున్నాం ఆయనతో పాటు ఆయన మీడియా సంస్థలను ఎదుర్కొంటున్నాం. మోసం చేస్తూ పెద్ద ఎత్తున అపద్దాలను ప్రచారం చేస్తున్నారు. మోసపోయిన వాళ్లను మళ్లీ మోసం చేస్తున్నారు. కందలేరు, సోమశిల ప్రాజెక్టులకు గోదావరి నీళ్లు తీసుకొస్తానని నెల్లూరు ప్రజలను మోసగిస్తున్నాడు. వెలిగొండ ప్రాజెక్టుకు గోదావరి నీళ్లు తీసుకొస్తానని చెబుతాడు. శ్రీశైలం ప్రాజెక్టును తెలంగాణ వారికి అప్పగిస్తామంటాడు. గోదావరి నీళ్లు తీసుకొచ్చి బనకచెర్లకు కలుపుతామని రాయసీమ ప్రజలను మోసగిస్తున్నాడు. చంద్రబాబు తప్పుడు కూతలతో రైతంగాన్ని పదేపదే మోసం చే స్తున్నాడు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాలు చేపట్టిన తరహాలోనే గ్రామ గ్రామానికి వెళ్లి రైతులకు పిల్లకాలవలు కావాలా వద్దా..? ఆయకట్టు వ్యవస్థ కావాలా వద్దా..? అని రైతులను అడుగుదాం. ఇలాంటి ఆలోచన చంద్రబాబుకు లేదు. కాంట్రాక్టర్ల కోసమే చంద్రబాబు ప్రాజెక్టులు తీసుకొస్తాడు. నీళ్లు ఇవ్వాలినే ఆలోచన ఉండదు. అనంతపురం జిల్లాలో వాటర్ స్టోరేజీకి కెపాసిటీ లేదు. రిజర్వాయర్ల నిర్మాణం చేయాలి. 3250 క్యూసెక్కుల హంద్రి-నివా సరిపోదు. గాలేరు-నగరి ప్రాజెక్ట్ నుంచి హంద్రి-నివా చివరి ఆయకట్టు చిత్తూరు జిల్లాకు 20 టీఎంసీల నీటిని తీసుకెళ్లే లిఫ్ట్ స్కీంను చంద్రబాబు అటకెక్కించాడు. అది పూర్తయితే అనంతపురం,కర్నూలు జిల్లాలకు 20 టీఎంసీల నీరు ఆదా అవుతుంది. పైగా హంద్రి-నీవా కాలువకు లైనింగ్ వేయడం ద్వారా భూగర్భజలాలు ఇంకిపోయి కాలువ కింద ఉన్న భూములన్నీ బీళ్లుగా మారే ప్రమాదం నెలకొంది.

## క్షతగాత్రులకు మెరుగైన చికిత్సను అందించండి

**- డాక్టర్లకు సూచించిన ఎమ్మెల్యే రాజు.**

మడకశిర టౌన్ మార్చి 01, ప్రభాతవార్త



ప్రమాదంలో గాయపడిన మహిళలను పరామర్శించిన ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు

మడకశిర నియోజక వర్గానికి చెందిన ప్రజలు రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయాన్ని తెలుసుకున్న స్థానిక శాసన సభ్యులు, ఎం.ఎస్. రాజు పరామర్శించారు. ఆదివారం అమరాపురం మండలం తమ్మిడేపల్లి గ్రామం నుండి రొళ్ల మండలం హెచ్.టి. హళ్లి గ్రామంలో నామకరణం కార్యక్రమానికి వెళుతున్న వారి బొలెరో వాహనం మార్గం మధ్యలో పేలుబండ గ్రామం సమీపంలో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో మహిళ ప్రయాణీకులు స్వల్పంగా గాయపడడంతో వారిని 108 వాహనం ద్వారా మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు. హుట్టా హుటిన ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుండి తక్షణమే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి మహిళలను పరామర్శించారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజలకు ఏ ఇబ్బంది ఉన్నా తనకు ఫోన్ చేయాలని, ఏ సమస్య ఉన్నా తనకు చెప్పాలని క్షతగాత్రులకు ఎం.ఎస్.రాజు ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి. మున్సిపల్ చైర్మన్ నరసింహ రాజు. రాష్ట్ర వక్కలిక కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీ నారాయణ. పట్టణ. మండల కన్వీనర్ నాగరాజులు ఉన్నారు.

## కార్యకర్తకు లక్ష రూపాయలు ఆర్థిక సాయం చేసిన ఎమ్మెల్యే

మడకశిర టౌన్ మార్చి 01, ప్రభాతవార్త.



అనారోగ్యంతో ఉన్న కార్యకర్త విజయ్ కుమార్ సతీమణుకు లక్ష రూపాయలు అందజేస్తున్న ఎమ్మెల్యే రాజు.

అనారోగ్యంతో మంచం పడ్డ కార్యకర్తకు ఆదుకోవాలని సంకల్పంతో ఆ కుటుంబానికి లక్ష రూపాయలు ఆర్థిక సాయం ఎమ్మెల్యే రాజు అందజేసి అండగా నేనుంటా నన్న భరోసా కార్యకర్తలకు ఇవ్వగలిగారు. తెలుగుదేశం పార్టీకి మా కార్యకర్త లే బలమంటూ మా కార్యకర్తల కుటుంబానికి ఏ కష్టం వచ్చినా నేను ఉన్నానంటూ భరోసా ఇస్తు అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబానికి నేనున్నానంటూ అండగా నిలిచిన ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందించి ఆ కుటుంబానికి అండగా నిలిచారు. టిడిపి కార్యకర్త కుటుంబానికి అండగా నిలబడతామని, తెలుగుదేశంపార్టీ కార్యకర్తలను ఆదుకోవడం తన కర్తవ్యమని ఆమెకు ఎం.ఎస్.రాజు భరోసా ఇచ్చారు. ఇబ్బందుల్లో ఉన్న తమ కుటుంబాన్ని లక్ష రూపాయలతో ఆదుకున్న ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజుకు విజయ్ కుమార్ భార్య పిల్లలు . ఆమె కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## మండల వక్కలిగ సంఘం మరో వర్గం డైరెక్టర్లు ఎంపిక

అమరాపురం మార్చి1ప్రభాతవార్త



వక్కలిగ సంఘం డైరెక్టర్లు దృశ్యం

మడకశిర నియోజకవర్గం వక్కలిగ సంఘం అధ్య క్షుని ఎంపిక కోసం నూతన కార్యవర్గాన్ని ప్రతి మండలం నుండి ఆరు మంది డైరెక్టర్లను ఎంపిక చేసుకోవడానికి వి లం వ్ర ని వ్వ డ ం విధితమే. ప్రస్తుతం హేమావతి గ్రామంలో వక్కలిగ సంఘం ముఖ్య నాయకులు ఆదివారం ప్రత్యేక సమావేశంను సిద్దేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణం వద్ద వక్కలిగ కుల బంధువులు నిర్వహించినట్లు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య నాయకులు మాట్లాడుతూ మడకశిరలో నియోజకవర్గస్థాయి కుంచిటిగ కుల బంధువుల సముదాయ సంఘంలో అమరాపురం మండలం నుండి ఎంపిక చేయాల్సి ఉన్నందున దీనిపై చర్చించడం జరిగినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా కుల పెద్దల సమక్షంలో డైరెక్టర్లుగా బసవనపల్లి రంగారెడ్డి, హేమావతి మంజునాథ్ రెడ్డి, నిద్రగట్ట శ్రీనివాస్, అగ్రహారం నాగరాజు, తమ్మదేపల్లి అనిల్ కుమార్, పుల్లికుంట గాలి దానేగౌడ్ లను స్టీరింగ్ కమిటీ మెంబర్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలోఎంపిక చేసినట్లు పత్రిక ప్రకటన ద్వారా వారు తెలిపారు. అయితే అమరాపురం మండలం నుండి శనివారం అమరాపురం సాయి విద్యానికేతన్ పాఠశాలలో కుంచిటిగ సంఘం నాయకులు సమావేశమై 6 మంది డైరెక్టర్లను రెండు రోజుల క్రితం ఎంపిక చేసుకున్నారు.అయితే ఉన్నట్లుండి కొందరు వక్కలిగలముఖ్య నాయకులు ఆదివారం ప్రత్యేకంగా హేమావతిలో సమావేశమై మరో వర్గం డైరెక్టర్లను ఆదివారం కొత్తగా ఎంపిక చేసుకోవడం విశేషం. ప్రస్తుతం అమరాపురం మండలం నుండి రెండు వర్గాల నుండి కూడా చెరో 6 మంది వంతున డైరెక్టర్లను ఎంపిక చేసుకోవడం పట్ల ఇందులో ఏ వర్గం డైరెక్టర్ల ప్రాధాన్యతకు మడకశిర నియోజకవర్గ కుంచిటిగ వక్కలిగ సంఘం ముఖ్య నాయకులు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.!

## అటవీ ప్రాంతంలో డ్రోన్లతో నిఘా



డ్రోన్ల ద్వారా పర్యవేక్షిస్తున్న దృశ్యం

లేపాక్షి, మార్చి 1 ప్రభాతవార్త

అటవీ ప్రాంతాల్లో డ్రోన్లతో నిఘా వ్యవస్థను కట్టుదిట్టం చేస్తున్నట్లు హిందూపురం రూరల్ సిఐ జనార్ధన్, లేపాక్షి ఎస్ఐ నరేంద్రలు పేర్కొన్నారు. మండల పరిధిలోని కొండూరు అటవీ ప్రాంతంలో ఆదివారం డ్రోన్లతో నిఘా నిర్వహించారు. అటవీ ప్రాంతంలో అనుమానాస్పద వ్యక్తుల సంచారంపై నిఘా వేయడం జరిగిందని వారు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడమే డ్రోన్ కెమెరా నిఘా ప్రధాన ఉద్దేశ్యమన్నారు. ముఖ్యంగా అక్రమ ఇసుక తరలింపు, గంజాయి సాగు, తదితర నేర కార్యకలాపాలను నియంత్రించేందుకు డ్రోన్ నిఘా ఏర్పాటు చేశామన్నారు. డ్రోన్ సహాయంతో అటవీ ప్రాంతంలోని లోతట్టు ప్రాంతాలు, అంతర్గత మార్గాలు సమగ్రంగా పరిశీలించామన్నారు. ఎలాంటి అక్రమాలు జరగకుండా ముందస్తుగా డ్రోన్ నిఘా ఏర్పాటు చేసినట్టు సిఐ తెలిపారు. అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పమన్నారు. ఈ విషయంలో ప్రజలు సహకరించాలని సిఐ జనార్ధన్, ఎస్ఐ నరేంద్రలు తెలిపారు.

## ఈనెల 3న లేపాక్షి ఆలయం మూసివేత

లేపాక్షి మార్చి 1 ప్రభాతవార్త

సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా ప్రపంచ ప్రసిద్ధి చెందిన లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయాన్ని ఈ నెల 3వతేదీ మంగళవారం మూసివేస్తున్నట్టు ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎంహెచ్ నరసింహమూర్తి తెలిపారు. ఉదయం నిత్య పూజల అనంతరం 8.30 గంటలకు దేవాలయం తలుపులు మూసివేయడం జరుగుతుందన్నారు. 4వతేదీ బుధవారం ఆలయం శుద్ధి చేసి స్వామివారికి అభిషేకాల అనంతరం తిరిగి భక్తులకు 8 గంటలకు యదావిధిగా దర్శనం కల్పించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

## రెప్పపాటు నిర్లక్ష్యం.. నమ్ముకున్న కుటుంబానికి శాపం

**- అవగాహన కల్పించిన పెనుకొండ డిఎస్పి నర్సింగప్ప, సిఐ శేఖర్**



అవగాహన కల్పిస్తున్న డిఎస్పి, సిఐ

గోరంట్ల, మార్చి 1 ప్రభాతవార్త

ప్రతి ద్విచక్ర వాహనదారుడు తన ఇంటి గుమ్మం దాటి ద్విచక్రవాహనంలో ప్రయాణం చేస్తే తప్పకుండా హెల్మెట్ ధరించాల్సిందేనని పెనుకొండ డిఎస్పి నర్సింగప్ప, గోరంట్ల సిఐ బోయ శేఖర్‌లు ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం పట్టణంలోని వెంకటేశయ్య పెట్రోల్ బంక్ వద్ద ద్విచక్రవాహనదారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించవలసిన నిబంధనలు పలు విషయాలపై అవగాహన కల్పిస్తూ రెప్ప పాటు నిర్లక్ష్యం వల్ల ప్రమాదానికి లోనై మన కుటుంబసభ్యులకు మనం దూరమై ఆ కుటుంబాన్ని కష్టాల పాలు చేసే సంఘటనలు చోటుచేసుకుంటాయని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## హనుమంత వాహనంపై ఊరేగిన లక్ష్మీనరసింహస్వామి



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి



దీపోత్సవంలో పాల్గొన్న మహిళలు

చిలమత్తూరు, మార్చి 1 ప్రభాతవార్త

చిలమత్తూరులో వెలసిన లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా స్వామివారు ఆదివారం హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అర్చకులు లక్ష్మీనరసింహస్వామి, ఆంజనేయస్వామికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి అనంతరం ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. పెద్దఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఇందులో భాగంగా ఆంజనేయస్వామి ఆలయంలో జరిగిన దీపోత్సవంలో పెద్దఎత్తున మహిళలు పాల్గొన్నారు. సాయంత్రం లక్ష్మీనరసింహ స్వామిని ప్రత్యేకంగా అలంకరించి హనుమంతవాహనంపై పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేపట్టారు.

## మెగా ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం



వైద్య శిబిరం ప్రారంభిస్తున్న దృశ్యం

అమరాపురం మార్చి 1, ప్రభాతవార్త

మండలకేంద్రంలోనిగుండే గౌడ్ హాస్పిటల్ నందు డాక్టర్ గుండేగౌడ్ ఆధ్వర్యంలో మెగా ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు . ఈ సందర్భంగా అనంతపురం పట్టణం కిమ్స్ సవేరా హాస్పటల్ సౌజన్యంతో ఆదివారం ఏర్పాటుచేసిన ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం నందు డాక్టర్ మధు, డాక్టర్ మాధవరెడ్డి, డాక్టర్ ప్రభాకర్ రెడ్డి మరియు కిమ్స్ సవేరా వైద్య సిబ్బంది దాదాపు 50 మంది మహిళలు పురుషులకు వైద్య చికిత్సలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో మామోగ్రఫీ, బి ఎండి, హెచ్ పి వి, స్కానింగ్( పాప్ స్మియర్ ) వైద్య పరీక్షలు నిర్వహించి క్యాన్సర్ వ్యాధిని ప్రారంభంలోని గుర్తిస్తే నివారించవచ్చని వారు తెలియజేశారు. అమరాపురం పట్టణ ప్రజలు మండల పరిధిలో ఉన్న ప్రజలు వైద్య శిబిరంలో పాల్గొన్నారు .అమరాపురం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సర్కిల్ హేమావతి రోడ్డు నందుగల గుండెగౌడ హాస్పిటల్ నందు ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మండల ప్రజల ఆరోగ్యం పట్ల వివిధ వైద్య ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తూ ఆరోగ్యం పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తూ వారిలో చైతన్యం తీసుకొస్తున్న గుండేగౌడ హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ గుండేగౌడ్ ను ప్రజలు అభినందించారు.

## మడకశిర తాలూకా యాదవ సంఘం అధ్యక్షుడిగా సన్నతిమ్మప్ప



కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకున్న దృశ్యం

రొళ్ల మార్చి1(ప్రభాతవార్త)

మడకశిర పట్టణంలోని యాదవ కమ్యూనిటీ భవనంలో యాదవ సంఘం కార్యవర్గాన్ని రాష్ట్ర యాదవ సంఘం ప్రధానకార్యదర్శి గుండుమల రాధాకృష్ణ ,జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనరసప్ప తదితర యాదవ సంఘం నాయకుల సమక్షంలో కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. మడకశిర తాలూకా యాదవ సంఘం అధ్యక్షుడిగా రొళ్ల మాజీ జెడ్పిటిసి సన్నతిమ్మప్ప ,ప్రధానకార్యదర్శిగా జయరాం,ఉపాధ్యక్షులుగా ఈరన్న,మల్లికార్జున, నాగరాజు,కార్యదర్శులుగా నాగరాజ్ చిత్తయ్య లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.త్వరలోనే మండల గ్రామస్థాయి కార్యవర్గాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

**యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా...**

## గోరంట్ల హరీష్‌కు కీలక పదవి



హరీష్ (ఫైల్‌ఫోటో)

గోరంట్ల, మార్చి 1 ప్రభాతవార్త

భారతీయ జనతా పార్టీ జిల్లా యువ మోర్చా ప్రధాన కార్యదర్శిగా గోరంట్లకు చెందిన హరీష్‌కు చాన్సు లభించింది. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో ఎంపికకు సహకరించిన పార్టీ జిల్లా అధ్యక్షులు గోరంట్ల మోహన్ శేఖర్‌కు, రాష్ట్ర యువమోర్చా అధ్యక్షులు సునీల్‌రెడ్డి, జిల్లా యువ మోర్చా అధ్యక్షులు కుల్లాయప్పయాదవ్, పూర్వ యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు మిట్ట వంశీకృష్ణ, పెనుగొండ అసెంబ్లీ బిజెపి నాయకులకు, గోరంట్ల మండల నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

**- బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేసిన మంత్రి**



చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి

గోరంట్ల మార్చి 1, ప్రభాతవార్త

గోరంట్ల మండల వ్యాప్తంగా వివిధ పంచాయతీలకు చెందిన 9 మంది ముఖ్యమంత్రి సహాయ నిధికి సాయం కోసం దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో ఆ కుటుంబాలపై సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం దాదాపు నాలుగు కోట్ల 22 లక్షల పైగా ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న నేపథ్యంలో ఆదివారం రాత్రి మంత్రి సవితమ్మ చేతుల మీదుగా బాధితులకు ఆ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్యాన్సర్ నిర్ధారణ శిబిరానికి విశేష స్పందన



క్యాన్సర్ పరీక్షలు చేస్తున్న వైద్యులు

ధర్మవరంటౌన్ , మార్చి 1 ప్రభాతవార్త

పట్టణంలోని కొత్తపేట శ్రీ ఉషోదయ స్కూల్లో బెంగళూర్ శంకర క్యాన్సర్ ఆస్పత్రి అండ్ రీసెర్చ్ ఇన్స్యూట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరానికి విశేషస్పందన లబించింది.ఈ వైద్యశిబిరంలో వైద్యులు బీఎన్, శ్రీనాథ్, ఇతర వైద్యుల బృందం 110 మందిని పరీక్షించగా ఇందులో 25 మందికి పాప్ స్మియర్స్ పరీక్షలు, 11మందికి మామోగ్రామ్ పరీక్షలు చేశారు.ఈ కార్యక్రమంలో కొత్తపేట ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్ర మెడికల్ ఆఫీసర్ ప్రియాంక, యువర్స్ పౌండేషన్ అధ్యక్షులు శీలానాగేంద్ర, కార్యదర్శి జయరాం ,కోశాదికారి నాగార్జున, సభ్యులు డాక్టర్ బీ వీ సుబ్బారావు, చాంద్ బాషా, పోలాప్రభాకర్, రాధాకృష్ణ, మోహన, వైకే శ్రీనివాసులు, మల్లికార్జున, రమేష్, సీకేరామాంజినేయులు, బండి నాగేంద్ర, ఓవీ ప్రసాద్, కేతాలోకేశ్ పాల్గొన్నారు.

## గుండెపోటుపై ముందస్తు జాగ్రత్తలు అవసరం

ధర్మవరంటౌన్ , మార్చి 1 ప్రభాతవార్త



గుండెపోటుపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

గుండెపోటుపై ప్రతి ఒక్కరు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్పందన ఆస్పత్రి అదినేత డాక్టర్ బషీర్ పేర్కొన్నారు. స్థానిక స్పందన ఆస్పత్రిలో ఆదివారం గుండెపోటుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వ సాధార ణంగా 40 నుంచి 50 సంవత్సరాల లోపు ఉన్నవారికి గుండెపోటు రావడం మృతి చెందడం జరుగుతోందని డాక్టర్లు బషీర్, అనస్తియా డాక్టర్అరుణ్, క్రిటికల్ కేర్ డాక్టర్ నియాజ్, డాక్టర్ రితిక్ లు అన్నారు. ఎదనొప్పి, ఛాతినొప్పి వచ్చినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యచికిత్సలు చేయించుకోవాలన్నారు. ముఖ్యంగా హార్ట్ ఎటాక్ ఉన్నవారు రైలు, బస్సు, సొంత వాహనం, విమానాలలో ప్రయాణం చేసేటప్పుడు తప్పనిసరిగా మందులతోపాటు కుటుంబసభ్యులలో ఒకరు శ్రద్ద వహించాలన్నారు.ఏ మాత్రం నిర్లక్ష్యం వహించిన ప్రమాదం తప్పదన్నారు. కావున వాకింగ్ తప్పని సరిగాచేయాలన్నారు.

## ఆలయ పునఃనిర్మాణానికి లక్ష విరాళం



ఆర్థిక సాయం అందజేస్తున్న దాత బాబుప్రసాద్

ధర్మవరంటౌన్ , మార్చి 1 ప్రభాతవార్త

పట్టణంలోని యాదవ వీదిలో వెలసిన వరసిద్ధి వినాయక ఆలయ పునఃనిర్మాణానికి పట్టణానికి చెందిన బాబుప్రసాద్ రూ.1లక్ష విరాళాన్ని అందజేశారు. ఈ మేరకు ఆదివారం దాత బాబుప్రసాద్, ఆయన సతీమణి సరస్వతి రూ.1లక్ష ఆలయ కమిటి సభ్యులకు అందజేశారు. అనంతరం దాతల పేరిట ఆలయ అర్చకులు పూజలు చేయించారు.

## వైభవంగా నసనకోట పెదయ్యస్వామి పెద్ద పరుష



పెదయ్యస్వామి పరుషలో ఊరేగుతున్న స్వాములు

రామగిరి, మార్చి 1 ప్రభాతవార్త

మండలంలోని నసనకోటలో గల కురుబల ఆరాధ్యదైవమైన అతకల్లు పట్నం పెదయ్యస్వామి పెద్దపరుష నూతన దేవాలయ ప్రవేశం ఆదివారం వైభవంగా జరిగింది. తెల్లవారు జామున బ్రహ్మముహూర్తంలో పెదయ్యస్వామి నూతన ఆలయ ప్రవేశం, గంగపూజ నిర్వహించారు. అనంతరం స్వామివారికి పుణ్యావచనం, గంగపూజ, రుద్రాభిషేకం, బిందెపూజ, కొత్తపూజారిని ఎంపిక చేసి పూజలు చేశారు. తెల్లవారుజామున ఈ పెద్ద పరుషకు ఆమ్వానించిన 20 మంది దేవర్లను పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించి ఒక్కొక్క స్వామి నసనకోట పెదయ్యస్వామితో బేటికావించారు. ఈ సందర్భంగా వేలాది మంది కురుబలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముఖ్యంగా ఈ స్వామిలోకి వెళ్లే వారికి పుట్టింటివాళ్లు సాంప్రదాయం ప్రకారం కొత్తగా పట్టు వస్త్రాలు అందించారు. మధ్యాహ్నం 2 గంటలకు అరికే బండారు ఇత్తే కార్యక్రమాన్ని నిర్వహించారు.

## వక్కలిగ డైరెక్టర్‌గా ప్రసన్నకుమార్



రొళ్ల మార్చి1,(ప్రభాతవార్త)

మండలంలోని ఎం.రాయపురం పంచాయతీ కుంచిటిగా వక్కలిగ డైరెక్టర్గా ప్రసన్న కుమార్ ను ఎన్నుకొన్నట్లు కుంచిటిగా కులస్తుడు ప్రసన్నకుమార్ తెలిపారు.శనివారం తన ఎంపికను కుంచిట్టిగా కులస్తుల నడుమ ఎన్నుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు తన ఎన్నికకు సహకరించిన కులస్తులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## నేడు పి జి ఆర్ ఎస్ తో పాటు రెవెన్యూ క్లినిక్స్ కార్యక్రమం



**జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్**

పుట్టపర్తి, మార్చి 2, ప్రభాతవార్త

ఈ నెల 2న సోమవారం ఉదయం శ్రీ సత్యసాయి పుట్టపర్తి జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజన్ కేంద్రాలు, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ దరఖాస్తులను జిల్లా కలెక్టరేట్ కు వచ్చే అవసరం లేకుండా meekosam.ap.gov.in లో ఆన్లైన్ ద్వారా కూడా సమర్పించవచ్చునన్నారు. దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో ప్రస్తుత సమాచారం ఆన్లైన్లో తెలుస్తుందని లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1100 ను సంప్రదించి తెలుసుకోవచ్చన్నారు. అలాగే సోమవారం జిల్లా కేంద్రం నందలి కలెక్టరేట్‌లో "రెవెన్యూ క్లినిక్స్" కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించి, భూమి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఏ శ్యాం ప్రసాద్ టెలికాన్ఫరెన్స్ ద్వారా రెవెన్యూ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని పుట్టపర్తి, పెనుకొండ, ధర్మవరం, కదిరి మరియు మడకశిర డివిజన్లకు చెందిన అధికారులు కలెక్టరేట్‌లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేస్తారు. ప్రజల నుంచి వచ్చే రెవెన్యూ సంబంధిత ఫిర్యాదులను స్వీకరించి, అక్కడికక్కడే పరిష్కరించేలా ఈ కార్యక్రమం చేపట్టబడుతుందన్నారు.ఈ రెవెన్యూ క్లినిక్స్ కార్యక్రమంలో అడంగల్ లో మార్పులు చేర్పులు, మ్యుటేషన్స్, పట్టాదార్ పేరు మార్పులు, అసైన్మెంట్ పట్టా, ఎఫ్లైన్, జాయింట్ ఎల్పీఎం సబ్ డివిజన్, 22 ఏ చుక్కల భూములు, రస్తా, స్మశాన వాటికల సమస్యలు, అలాగే వివిధ భూ వివాదాలు, పట్టాదార్ పాస్ పుస్తకాలు, ఆన్‌లైన్ రికార్డుల సవరణ, వారసత్వ నమోదు, ఆక్రమణలపై ఫిర్యాదులు తదితర అంశాలను అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలన్నారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కారం చూపాలనే దిశగా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని కలెక్టర్ పేర్కొన్నారు.

## అంగన్వాడీలకు గతంలో వేతనాలు పెంచింది సీఎం చంద్రబాబే...!

ధర్మవరం,మార్చి1,ప్రభాతవార్త



మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

అంగన్వాడీ కార్యకర్తలకు, ఆయాలకు గతంలో ఎప్పుడూ ఎవరూ చేయని విధంగా రెండు సార్లువేతనాలు పెంచింది సీఎం చంద్రబాబునాయుడే అని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ పరిటాలశ్రీరామ్ అన్నారు. ఆదివారం ఆయన అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు...ప్రస్తుతం అంగన్వాడీలు తమ డిమాండ్ల కోసం ఆందోళన బాటపట్టిన నేపథ్యంలో ఆయన ప్రత్యేకంగా కొన్ని అంశాల గురించి ప్రస్తావించారు. గత ప్రభుత్వంలో మీకుఎలాం టిమేలు జరిగింది. ఇప్పుడు ఏం జరుగుతోందన్నది పునఃపరిశీలన చేసుకోవాలనని పరిటాలశ్రీరామ్ సూచించారు. జగన్రెడ్డి అవలంబించిన విధానాలతో రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం ఉన్నప్పటికీ అన్ని సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ సీఎం చంద్రబాబు ముందుకెళ్తున్నారన్నారు. ఈ క్రమంలో అంగన్వాడీలకు గతంలో ఇచ్చిన హామీలగురించి కూడా ప్రభుత్వం పరిశీలన చేస్తోందన్నారు. అయితే ఈ 20నెలల కాలంతో పాటుగతంలో అంగన్వాడీలకు ఏం చేశామన్నది ఒక్కసారి వారే గమనించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాలకు తాగునీటి సౌకర్యాలు, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.86.68 లక్షలు విడుదల చేసి ఒక్కో కేంద్రానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించిందన్నారు. అంగన్వాడీలకు ప్రతినెల 1వతేదీనే వేతనాలు అందేలా చర్యలు తీసుకొని58,204 మంది అంగన్వాడీ వర్కర్లు, సూపర్వైజర్లు, బ్లాక్ కో ఆర్డినేటర్లకు రూ.75కోట్ల వ్యయంతో 5జీ స్మార్ట్ ఫోన్లను అందించిందన్నారు. రాష్ట్రంలో 5వేలమినీ అంగన్వాడీ కేంద్రాలను పూర్తిస్థాయి అం గన్వాడీ కేంద్రాలుగా అప్ గ్రేడ్ చేస్తోందన్నారు. వేతనాల పెంపు విషయం కూడా వీలైనంత వరకు అమలు చేసే దిశగా ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు.

## శాసనమండలిలో వైకాపా తీరు సిగ్గుచేటు



సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి నాయకులు

పుట్టపర్తి టౌన్ మార్చి 1 ప్రభాతవార్త

శాసనమండలి సమావేశాలలో వైకాపా సభ్యులు వ్యవహరించిన తీరు సిగ్గుచేటు అని బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. శ్రీ సత్య సాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తి లోని బిజెపి కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు జిఎం శేఖర్ ఆధ్వర్యంలో యువ మోర్చా జిల్లా అధ్యక్షుడితో పాటు కార్యవర్గం బాధ్యతలు స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన కుళ్లాయప్ప యాదవ్ ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించారు. బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల వైకాపా పాలనలో రాష్ట్రంలోని అనేక దేవాలయాలపై దాడులు జరిగిన విషయాలపై విచారణ జరుగుతున్న సమయంలో, శాసనమండలిలో వైకాపా సభ్యులు బిజెపికి చెందిన ఇద్దరు మంత్రులపై వ్యవహరించిన తీరు సమంజసంగా లేదన్నారు. శాసన సభతో పాటు శాసనమండలిలో వైకాపా ప్రతిపక్ష పాత్ర పోషించడంలో విఫలమైందన్నారు. ప్రతిపక్ష హోదా లేదని వైకాపా అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి శాసనసభను వదిలి వెళ్లిపోయారని, 2014 నుంచి 2019 వరకు ప్రతిపక్ష హోదా ఉన్నప్పటికీ ఎందుకు శాసనసభను వదిలి వెళ్లిపోయారని ప్రశ్నించారు. అంతకుమునుపు యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ రెడ్డి మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీలో ఏడు మోర్చాలు ఉంటాయని, అందులో యువమోర్చా ద్వారా యువకులకు పూర్తిస్థాయి బాధ్యతలు ఇవ్వడం జరుగుతుందన్నారు. యువ మోర్చా ద్వారా ఎన్నికైన కార్యవర్గంకు నేడు నియామక పత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు. యువత రాజకీయాల్లోకి రావాలని భారతీయ జనతా పార్టీ ఆహ్వానిస్తుందని, నిరుద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉమ్మడి జిల్లా ఫార్మసీ ఆఫీసర్స్ ప్రెసిడెంట్‌గా గోరంట్ల నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నిక

గోరంట్ల మార్చి 1, ప్రభాతవార్త



నాగరాజు (ఫైల్ ఫోటో)

ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మరియు సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో జిల్లా ఆసుపత్రిలో మరియు గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ అనంతపూర్ లో ఫార్మసీ ఆఫీసర్లుగా విధులు నిర్వహిస్తున్నటువంటి ఫార్మసీ ఆఫీసర్లు అందరూ కలిసి జిల్లా కమిటీ ని ఎన్ను కోవడం జరిగినది కమిటీ సభ్యులు ఈ క్రింది విధంగా ఎన్నిక కావడం జరిగింది. జిల్లా అధ్యక్షునిగా కె ఆర్ నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా ఆదిలక్ష్మి గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ అనంతపూర్ కోశాధికారిగా ఎం బాలకృష్ణ ఉరవకొండ సిహెచ్ సి జిల్లా కార్యవర్గ సభ్యులుగా మజీహాబాను అమర్నాథ్ విశాలాక్షి యామిని జ్యోతి తులసిదేవి నజ్మా భాను శ్రీలేఖ కౌసర్ రుబీనా ఇర్షాద్ ఖాన్ కాంతరాజు నూతన ప్రసాద్ హరినాథ్ తేజస్వినీ ఇరేష్ రాము నాయక్ వినయ్ తదితరులను అనంతపురం సత్యసాయి జిల్లా ఫార్మసీ ఆఫీసర్ల జిల్లా కమిటీని ఎన్నుకోవడం జరిగింది ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షునిగా ఎన్నికైన కె ఆర్ నాగరాజు మాట్లాడుతూ అధికారులను ప్రజాప్రతినిధులను కలిసి డిమాండ్ల సాధనకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలియజేశాడు. ఈ కార్యక్రమంలో పరుగులు పాల్గొన్నారు.

03ATP01_03ATP01.qxd 01-03-2026 PM 10:32 Page 1



## యుద్ధ ప్రాతిపదికన అగ్రిగోల్డ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక ఫాస్ట్ కోర్టులు ఏర్పాటుకై డిమాండు



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం, మార్చి 1 ప్రభాతవార్త బ్యూరో

దీర్ఘకాలికంగా అగ్రిగోల్డ్ బాధితులు ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా లేకపోవడం దురదృష్టకరమని అగ్రిగోల్డ్ కస్టమర్స్, వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు బి.కేశవరెడ్డి, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి సిద్దేశ్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయ పేర్కొన్నారు. ఆదివారం అగ్రిగోల్డ్ బాధితుల ఆందోళనకు సంబంధించిన కరపత్రం సిపిఐ కార్యాలయంలో విడుదల చేసి విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. సోమవారం నుండి విజయవాడ ధర్నా చౌక్ వద్ద జరిగే ఆందోళనలో అనంతపురం జిల్లా అగ్రిగోల్డ్ బాధితులు ప్రత్యక్షంగా పాల్గొనటం జరుగుతుందన్నారు. ఇదే విధంగా అగ్రిగోల్డ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక ఫాస్ట్ కోర్టులు ఏర్పాటుకై చాలా కాలం నుండి కోరడం జరుగుతుందని ప్రభుత్వం మెండి వైఖరి అవలంబించడంతోనే సోమవారం నుండి ఉద్యమం బలోపేతం చేస్తున్నట్లు వారు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం తీవ్ర రూపంలో వుంటుందని ప్రభుత్వం బాధితులకు న్యాయం జరిగే వరకు ఉద్యమం ఆగదని అధికారంలోకి రావడానికి అగ్రిగోల్డ్ బాధితులను పావుగా వాడుకొని అధికారంలోకి వస్తేనే మమ్మల్ని మరచి పోవటం ఆనవాయితీగా మారిందని వారు వాపోయారు. అగ్రిగోల్డ్ బాధితులు చేపట్టే న్యాయమైన ఉద్యమానికి ప్రజలు మద్దతు అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అగ్రిగోల్డ్ కస్టమర్స్, వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కుల్లాయప్ప, శ్రీనివాసులు, కాటమయ్య, నారాయణరెడ్డి, కృష్ణవేణి, తిప్పయ్యస్వామి పాల్గొన్నారు.

## శ్మశాన వాటికల కోసం యాత్రను విజయవంతం చేయండి


నిరసన వ్యక్తం చేస్తున్న జెసి నేతలు

అనంతపురం న్యూటౌన్, మార్చి 1 ప్రభాతవార్త

చస్తే పూడ్చుకోవడానికి శ్మాశానాలు కరువయ్యాయని ఉద్యమాలు చేయాల్సి వస్తోందని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి మండిపడ్డారు. ఆదివారం నగరంలోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ముందు శ్మాశాన వాటికల సాధన కోసం జీపు యాత్ర నిర్వహిస్తున్నట్లు వివిధ కుల ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్ టీయూ జిల్లా కార్యదర్శి బి సురేష్, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు సుగా మంచి శ్రీనివాసులు, ఐఎంఎం బాషా, బేడ బుడగ జంగం రాష్ట్ర కార్యదర్శి శిరిశాల అంజి, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక టివి రెడ్డి, పూసల సంఘం జిల్లా అధ్యక్షులు పూసల హనుమంతు, రాయలసీమ విద్యావంతుల వేదిక వెంకటేష్, అనంత పరక్షణ వేదిక సోమర రాహుల్, మాదిగ హక్కుల పోరాట సమితి చియ్యేడు నారాయణ స్వామి, నవయువ సమాఖ్య విశ్వనాథ్‌లు మాట్లాడారు. జీపు యాత్ర 14నియోజకవర్గా ల్లోను కొనసా గుతోందని అలాగే శ్రీ సత్య సాయి, అనంతపురం కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నాలు చేపడుతున్నట్లు జీపు యాత్రలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జేసీ నాయకులు ఈశ్వరయ్య, అదాం, లక్ష్మణ, హరిబాబు, కేశగాళ్ల ప్రసాద్, ఆనంద్, సురేష్, అది, కదింప్ప, సుధాకర్, పెద్దన్న, శ్రీరాములు, బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వర్ణోత్సవాల నిర్వహణ



పూర్వపు విద్యార్థుల ంతా కలిసి ఉన్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, మార్చి 1 ప్రభాతవార్త

ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల 1976 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం కళాశాలలో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. 1976లో సిపిజెడ్ గ్రూప్ నుంచి దాదాపుగా 21 మంది విద్యార్థులు చదువుకున్నారు. విద్యాభ్యాసం జరిగి 50 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా స్వర్ణోత్సవాలను ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి పూర్వ విద్యార్థులందరూ హాజరై కళాశాలతో తమకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. ఇక్కడ చదివిన విద్యార్థులు ఎన్నో ఉన్నత శిఖరాలను అధిరో హించారని గుర్తు చేశారు. తమ అధ్యాపకులైన వాసుదేవ రావు, సుబ్బన్న, మాధవరావు, కృపాకర్, శ్రీనివాస్ శెట్టి, లక్ష్మినారాయణ వంటి వారిని గుర్తు చేసుకున్నారు. ఈ బ్యాచ్‌కు చెందిన డి.ప్రవీణ డిస్ట్రిక్ట్ జడ్జిగా పనిచేసి ప్రస్తుతం ఆమె మానవ హ క్కుల కమిషన్ సభ్యురాలుగా ఉండటం మాకు గర్వంగా ఉందన్నారు. తమ అందరి ఇష్ట గురువైన వాసు దేవరావు పేరున ఎండోమెంట్ బహు మతి ఇవ్వడానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా తెలి యజేశారు. అనంతరం సమావేశాన్ని నిర్వహిం చడానికి సహకరించిన కళాశాల ప్రిన్సిపల్ పద్మశ్రీకి ధన్యవాదాలు తెలియజేశారు.

## సమయపాలనలో కఠిన ఆంక్షలు తగదు-ఆపస్



మాట్లాడుతున్న ఆపస్ నేతలు

అనంతపురం న్యూటౌన్, మార్చి 1 ప్రభాతవార్త

అనంతపురం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షురాలు కళ్యాణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజేంద్రప్రసాద్ మాట్లాడారు. ఉపాధ్యాయుల హాజరు వ్యవస్థపై అమలు చేస్తున్న అత్యంత కఠిన, కేంద్రీకృత విధానాలు విద్యా వాతావరణాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని, ఇప్పటికే ఉపాధ్యాయులు బోధనేతర పనులు, వివిధ కార్యక్రమాలు, పరిపాలనా బాధ్యతలతో తీవ్రమైన ఒత్తిడిలో ఉన్నారు అని, అదనంగా అధికారులు తీసుకుంటున్న వరుస నిర్ణయాలు వారిపై మానసిక ఒత్తిడి, ఆందోళనకు గురి చేస్తున్నా యని, ఈ పరిస్థితుల్లో మరింత కఠిన హాజరు ఆంక్షలు విధించడం సమంజసం కాదు అని వారు పేర్కొన్నారు. ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలు మానుకొని ప్రశాంత వాతావరణం కల్పించాలని ఆపస్ అనంతపురం జిల్లా అధ్యక్షురాలు కళ్యాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రిస్వా మి డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో జిల్లా ఉపాధ్యక్షులు పి.శివ ప్రసాద్ నాయుడు, వై.రామన్న, హర్షవర్ధన్, జిల్లా కార్యదర్శులు పీజీ రమేష్, వెంకటేష్, దాసరి వరదరాజులు, అనంతపురం నగర అధ్యక్షులు చికిరప్ప, బెలుగుప్ప మండల అధ్యక్షులు మలోబన్న, ప్రధానోపా ధ్యాయులు ఉమా మహేశ్వర్, జిల్లా కార్యవర్గ సభ్యులు పోతులయ్య, మల్లికార్జున, విజయ్, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై శాసనసభలో చర్చించండి...!
### - శాసనసభ్యులకు ఏపిటిఎఫ్ 1938 మెమోరాండం


మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం


శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, మార్చి 1 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర సంఘం పిలుపుమేరకు ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం దశల వారి ఉద్యమ కార్యా చరణలో భాగంగా ఉమ్మడి అనంతపురం జిల్లా మడకశిర శాసన సభ్యులు ఎమ్మెస్ రాజు కి, శింగనమల శాసనస భ్యురాలు బండారు శ్రావణి శ్రీకి ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 1938 అనంతపురం జిల్లా శాఖ పక్షాన మెమోరాండం అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం వెంకటసుబ్బయ్య జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్.శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస నాయక్, నాయ ంకులు సత్య ప్రసాద్, ఆంజనేయులు నాయక్, వజీర్ భా షా, నాగరాజు, శ్రీనివాసులు, బాలనల్లప్ప, నరసింహులు, సూర్యనారాయణ, రామకృష్ణ, వెంకట్ రాముడు నాయక్, జగన్, వెంకనాయక్, మురళీకృష్ణ, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## చలో ఢిల్లీ విజయవంతం చేయండి



పోస్టర్లను విడుదల చేస్తున్న ఎపిటీచర్స్ ఫెడరేషన్ నేతలు

అనంతపురం న్యూటౌన్, మార్చి 1 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేస్తూ, రాష్ట్ర పూర్వ అధ్యక్షులు రఘురామిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పాతిరెడ్డి, జిల్లా అధ్యక్షులు నరేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి మోహన్ రెడ్డిలు మాట్లాడుతూ.. నోటిఫికే షన్‌కు ముందు నియామకాలు పొందిన ఉపాధ్యా యుల ందరికీ టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని ఏపీ టీఎఫ్ ఆధ్వర్యంలో మార్చి నెల 10వ తారీఖున దేశ రాజధాని జంతర్‌మంతర్ దగ్గర ధర్నా కార్యక్రమం నిర్వహిస్తు న్నామని, ఈ కార్యక్రమంలో కార్యకర్తలు అధిక స్థాయిలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జీవోల కమిటీ మెంబర్ గురురాజా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాధవి, జిల్లా సబ్ కమిటీ సభ్యులు డేనియల్, రామాంజనేయులు, సుభద్ర, రామకృష్ణ, సూర్యనారాయణ, శేషపణీ రాజు, ఓబన్న, రంగనాయకులు, రవి, రాష్ట్ర కౌన్సిలర్లు జె.వెంకటేశులు, పుల్లయ్య, ఓబుళేసు, కె.వెంకటేశులు, అనిల్‌కుమార్, శివారెడ్డి, జిల్లా ఆడిట్ కన్వీనర్ లక్ష్మినారాయణ, కల్చరల్ కమిటీ మెంబర్ గోపాల్ నాయక్, వివిధ మండల బాధ్యులు పాల్గొన్నారు.

## భవిష్యత్ కార్యాచరణ సమావేశానికి హాజరైన రమేష్‌రెడ్డి


: సమావేశంలో పాల్గొన్న రమేష్‌రెడ్డి

తాడిపత్రిటౌన్, మార్చి 1 ప్రభాతవార్త

వైఎస్ఆర్ కడప జిల్లాలోని మేడ కన్వెన్షన్‌లో జరిగిన గ్రేటర్ రాయలసీమ ఎత్తిపోతల పథకం భవిష్యత్ కార్యాచరణ సమావేశానికి తాడిపత్రికి చెందిన వైసిపి రాష్ట్ర కార్యదర్శి కొనుదుల రమేష్‌రెడ్డి హాజరయ్యారు. వైసిపి అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గ్రేటర్ రాయలసీమలో పెండింగ్ ఇరిగేషన్ ప్రాజెక్టుల గురించి మరియు రాయలసీమ ఎత్తిపోతల పథకం నిర్మాణంలో భాగంగా చంద్రబాబునాయుడు నిర్లక్ష్య వైఖరితో గ్రేటర్ రాయలసీమకు చేస్తున్న అన్యాయం గురించి నిర్వహించిన గ్రేటర్ రాయలసీమ ఎత్తిపోతల పథకం భవిష్యత్ కార్యాచరణ సమావేశంలో ఆయన పాల్గొన్నారు.

## క్రీడలతో మానసిక ఉల్లాసం ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య



జిల్లా క్రీడా మహోత్సవాన్ని ప్రారంభిస్తున్న ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు

అనంతపురం వైద్యం మార్చి 1 ప్రభాతవార్త

ఎంతో ఒత్తిడితో కూడుకున్న ఉద్యోగాలలో క్రీడలు నూతన ఉత్సాహాన్ని మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య అన్నారు ఆదివారం స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో అనంతపురం ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ శాఖ సిబ్బందికి క్రీడ మహోత్సవాలు నిర్వహించారు ఈ క్రీడా మహోత్సవాలకు డిసి నాగమద్దయ్య అనంతపురం సత్య సాయి జిల్లాల ఈఎస్ లు రామ్మోహన్ రెడ్డి గోవింద నాయక్ అసిస్టెంట్ ఈఎస్ లు నరసింహులు రేవతి డిఎం వేణుగోపాల్ రెడ్డి హాజరై జెండా ఊపి క్రీడా మహోత్సవాలను ప్రారంభించారు అనంతరం ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జయనాథరెడ్డి, కార్యదర్శి ఎన్ జాకీర్ హుస్సేన్ అనంతపురం జిల్లా కానిస్టేబుల్స్ హెడ్ కానిస్టేబుల్స్ అసోసియేషన్ అధ్యక్షులు మోహన్ కార్యదర్శి రాజగోపాల్ ల ఉద్యోగుల మధ్య క్రీడా పోటీల నిర్వహణ చేశారు. ఇరు జిల్లాలకు చెందిన ఉద్యోగులు క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

## గార్లదిన్నెలో ఉచిత దంత చికిత్స శిబిరం.


ఉచిత దంత చికిత్స శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

గార్లదిన్నె, మార్చి 01,ప్రభాతవార్త :

గార్లదిన్నె గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలో ఆదివారం ఉచిత దంత చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రఖ్యాతి డెంటల్ హాస్పిటల్ డాక్టర్ అభిషేక్ ప్రఖ్యాత్, ఇంజనీర్ నాగరాజు మరియు పామిడి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ డెంటల్ క్యాంప్‌కు సుమారు 70 మంది రోగులు హాజరై పరీక్షలు చేయించుకున్నారు. రోగులకు అవసరమైన దంత పరీక్షలు నిర్వహించి, తగిన సూచనలు అంది ంచారు. అలాగే వచ్చిన పేషెంట్లకు పేస్టు, బ్రష్‌లు, టాబ్లెట్లు ఉచితంగా పంపి ణీ చేశారు.ఈ కార్యక్రమంలో పామిడి లయన్స్ క్లబ్ సభ్యులు డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు, డాక్టర్ శాంతి ప్రియా, పత్రా శ్రీనివాసులు, గంగ శేఖర్, మహేష్, అంబేద్కర్ నరేష్ కుమార్, రాకేష్ కుమార్, గంగ శేఖర్ కొండూరు, అమర్నాథ్ రెడ్డి, హర్ష మెడికల్ స్టోర్ సురేష్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.గ్రామ ప్రజలకు ఉపయోగపడేలా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు.

## స్నేహలత వివాహానికి ..10,000 ఆర్థిక సహాయం


రూ.10,000 చెక్కును అందజేస్తున్న ముంటిమడుగు కేశవరెడ్డి

గార్లదిన్నె, మార్చి 01,ప్రభాతవార్త :

గార్లదిన్నె మండలం బూదేడు గ్రామా నికి చెందిన జెన్నె సూర్య నారాయణ కుమార్తె స్నేహలత వివాహానికి ఉమ్మడి అనంతపురం జిల్లా ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ మరియు శింగనమల నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి రూ. 10,000 ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా కేశవరెడ్డి మాట్లాడుతూ నిరుపేద కుటుంబాల వివాహాలకు సహాయం చేయడం ఆనంద కరమని, బడుగు బలహీన వర్గాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. నూతన వధూవరులు సుఖ సంతోషాలతో వైవాహిక జీవితం గడపాలని ఆకాంక్షిం చారు.ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానికులు పాల్గొన్నారు.

## కోటంక గుంటి కింద శ్రీ సుబ్రహ్మణ్య స్వామికి విశేష అలంకారం


కోటంక గుంటి కింద శ్రీ సుబ్రహ్మణ్య స్వామి వారి పుష్పాల ంకారం

గార్లదిన్నె, మార్చి 01, ప్రభాతవార్త :

గార్లదిన్నె మండలం కోటంక గ్రామంలోని గుంటి కింద సుబ్రహ్మణ్య స్వా మి దేవాలయంలో శ్రీ సుబ్రహ్మణ్య స్వామికి విశేష పూజలు, పుష్పాలంకారం అర్చకులు వైద్యం రామాచార్యులు ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో స్వామిని సుందరంగా అలంకరించి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు.ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణం భక్తి శ్రద్ధలతో మార్మోగింది.

## కేజీబీవీ బోధనేతర ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలి


డా.కె.విజయ్

అనంతపురం న్యూటౌన్, మార్చి 1 ప్రభాతవార్త

ఉమ్మడి అనంతపురం జిల్లా సమగ్ర శిక్ష పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో పనిచేస్తున్న బోధనేతర ఉద్యోగులకు వెంటనే బకాయి వేతనాలు చెల్లించాలని సమగ్ర శిక్ష కేజీబీవీ ఉద్యోగుల ఫోరం జేఏసీ ఉమ్మడి జిల్లా చైర్మన్ డా.కె.విజయ్ ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేజీబీవీ నాన్ టీచింగ్ ఉద్యోగులకు ఆరు నెలలుగా వేతనాలు చెల్లిం చాక పోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారన్నారు. అనంతపురం జిల్లాలో 62 మంది, సత్యసాయి జిల్లాలో 11 మంది కుక్స్, అసిస్టెంట్ కుక్స్, చౌకి దార్లు, వాచ్‌మెన్లు, స్వీపర్లు, వార్డెన్లు గత ఏడాది ఆగస్టు, సెప్టెంబర్ నెలలో విధుల్లో చేరినప్పటికీ వారికి జీతాలు చెల్లించలేదన్నారు. ప్రతి నెల రూ.15,000 చొప్పున వేతనం ఇవ్వాల్సి ఉన్నప్పటికీ ఇప్పటివరకు ఒక్క నెల జీతం కూడా అందలేదన్నారు. ప్రభుత్వం ఖాళీగా ఉన్న బోధనేతర ఉద్యోగాల నియామకాలు నిర్వహించినప్పటికీ వీరికి వేతనాలు విడుదల చేయకపోవడం అన్యాయమన్నారు. జీతాలు రాక ఉద్యోగులు అప్పులు తెచ్చుకొని కుటుంబాలను పోషించుకుంటున్నారని, ప్రస్తుతం అప్పులు కూడా దొరకని పరిస్థితి ఏర్పడిందని, కుటుంబ పోషణ చాలా కష్టంగా మారిందన్నారు. దీనిపైన జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి పెండిం గ్‌లో ఉన్న జీతాలను తక్షణమే మంజూరు చేసి విడుదల చేయాలి డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యోగులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

## మహిళలు అన్ని రంగాలలో రాణించాలి : సిఐ శ్రీహర్ష
### - ఘనంగా ప్రపంచ మహిళా దినోత్సవం !



ఉమెన్స్ డే నిర్వహిస్తున్న మహిళలు, మహిళా పోలీసులు

రాప్తాడు, మార్చి 1 ప్రభాతవార్త

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సిఐ శ్రీ హర్ష తెలిపారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సీఐ శ్రీహర్ష ఆధ్వర్యంలో మహిళలు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీహర్ష మాట్లాడుతూ..చదువుతోపాటు ఆరోగ్య సంరక్షణ స్వావలంబన తదితర అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. ఒక మహిళ ఉన్నత స్థాయిలో ఉంటే కుటుంబానికి సమాజానికి ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. మహిళలు సాధికారత సాధించడం వల్ల సమాజం కుటుంబం అభివృద్ధి చెందుతుందన్నారు. అదే విధంగా నేటి సమాజంలో మహిళలు విద్యా విజ్ఞానంతో ముందు కెళ్లడం అభినందనీయం అని అన్నారు. సమానత్వం కోసం సాగిన సమరమే ఈ దినోత్సవం కాబట్టి ఆకాశంలో సగభాగమైన మహిళలు అవకాశాల్లో, అన్ని రంగాల్లో ఉన్నతంగా ఎదగాలని అన్నారు. శ్రమలో పుట్టి, పెరుగుతున్న శ్రామిక నారీమణులందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పుట్టిన గ్రామంలో సేవాకార్యక్రమాలు చేయడం ఆనందంగా ఉంది
### - రవికాంత్ క్యాటరర్స్ రమణ


అద్దాలను పంపిణీచేస్తున్న రవికాంత్ క్యాటరర్స్ రమణ

బుక్కరాయసముద్రం మార్చి 1 ప్రభాతవార్త

పుట్టిన గ్రామంలో సేవాకార్యక్రమాలు చేయడం ఎంతో ఆనందగా ఉందని రవికాంత్ క్యాటరర్స్ రమణ అన్నారు. ఆదివారం బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో రిక్రియేషన్ క్లబ్ ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామి మండపంలో ఏర్పాటుచేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథులుగా హాజరైనారు.ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ గత ఆదివారం గ్రామంలోని ఎలిమెంటరీ స్కూల్ నందు నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరంలో కంటిపరీక్షలు నిర్వహించిన వారికి రవికాంత్ క్యాటరర్స్ రమణ వారి సౌజన్యంతో 65 మందికి కంటి అద్దాలను ఉచితంగా పంపిణీచేయడం జరిగింది. నా సతీమణి కీర్తిశేషులు కొప్పల మీనాక్షమ్మ జ్ఞాపకార్థం ప్రతి నెల 25వ తేదీనా 40 మందికి కంటి ఆపరేషన్లు చేయి స్తున్నామని తెలిపారు.గ్రామంలో పేదవారు ఎవరైనా కంటి సమస్యలతో ఉంటే తమ దగ్గరికి వస్తే వారికి ఉచితంగా కంటి ఆపరేషన్ చేయిస్తామన్నారు.

ఇప్పటికి 3000 వేలమందికి కంటి ఆపరేషన్లు చేయించామన్నారు.బుక్క రాయసముద్రం ఎంప్లాయిస్ రిక్రియేషన్ క్లబ్ ఆధ్వర్యంలో మరిన్ని ఉచిత ఆరోగ్యశిబిరాలను నిర్వహిస్తామన్నారు .ప్రజలు ఈ అవకాశాన్ని సద్వి నియోగం చేసుకోవాలన్నారు. అనంతరం టీడిపి నాయ కులు అశోక్ మాట్లాడుతూ బుక్కరాయసము ద్రంలో జన్మించిన రవికాంత్ రమణ అన్న పుట్టినందుకు జన్మ భూమికి సేవ చేవచేయాలనే ఉద్దేశంతో అందికి కంటే గ్రామానికి ఎక్కవగా సేవా కార్యక్రమాలు చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు టీడీపీ నాయకులు ఎస్ నారాయణ స్వామి,ఆలయ ధర్మకర్త నారాయణస్వామి, ఎంప్లాయిస్ రిక్రియేషన్ క్లబ్ సభ్యులు సూర్య నారాయణ రావు,నాగేంద్ర, సత్యనారాయ ణ,శివకుమార్,ప్రభాకర్,రామ్మోహన్ తదితిరులు పాల్గొన్నారు.

## మాజీ సైనికుడికి ఘన నివాళులు


మాజీ సైనికుని సేవలకు సెల్యూట్ చేస్తున్న మాజీ సైనికుల సంఘం నేతలు

అనంతపురం, మార్చి 1 ప్రభాతవార్త బ్యూరో

దేశానికి తన సేవలు చేసి రిటైర్డ్ అయిన తర్వాత కూడా రాష్ట్రానికి తన దైన సేవలు అందించి ప్రస్తుతం పరమపదించిన మాజీ సైనికులు కె.వన్నూరప్ప(77) మాజీ సైనికులు పెద్ద ఎత్తున పాల్గొని ఘన నివాళులు అర్పించారు.అనంతపురం పట్టణంలోని రెండవ రోడ్డులో మిత్ర హోటల్ దగ్గర గల అపార్ట్మెంట్‌లోమాజీ సైనికుడు కె.వన్నూరప్ప ఆదివారం తెల్ల వారుజామున అనారోగ్య కారణాల వల్ల మృతి చెందారు. ఆయనకు భార్య నలుగురు కుమార్తెలు ఉన్నారు. సైన్యము నుండి పదవీ విరమణ తర్వాత సిండికేట్ బ్యాంకులో గార్డ్ డ్యూటీ చేసి రిటైర్డ్ అయ్యారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా మాజీ సైనికుల అధ్యక్షుడు కెప్టెన్ దూదేకుల షేకన్న ఆధ్వర్యంలో నివాళులర్పించి కుటుంబానికి ధైర్యం చెప్పి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నరసింహులు, సిద్దన్న, బండి వెంకటరమణ, అబ్దుల్ ఖాదర్, బాలస్వామి, సాదిక్ బాష తదితరులు పాల్గొన్నారు...

## సజావుగా మూడు ప్రవేశ పరీక్షలు


ప్రవేశ పరీక్షలను పరిశీలిస్తున్న డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ కె.విజయలక్ష్మి

అనంతపురం న్యూటౌన్, మార్చి 1 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ద్వారా నిర్వహి ంచ బడుతున్న డా.బిఆర్.అంబేద్కర్ గురుకుల విద్యాల యాలలో 5వ తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి (జన రల్), ఐఐటి/నీట్ ప్రవేశ పరీక్షలు ఆదివారం సజావు గా నిర్వహి ంచినట్లు డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ కె.విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి ప్రవేశ పరీక్ష ఉదయం 9:30 నుంచి 11:00 గంటల వరకు, ఇంట ర్మీడియెట్ మొదటి సంవత్సరం (జనరల్) ప్రవేశ పరీక్ష 12:00 పిఎం నుంచి 1:30 పిఎం వరకు, ఐఐటి/ నీట్ ఇంటర్మీడియెట్ ప్రవేశ పరీక్ష 3:00 పిఎం నుంచి 4:30 పిఎం వరకు నిర్వహించబడినట్లు తెలిపారు. 5వ తరగతి ప్రవేశ పరీక్షకు 7,040 మంది విద్యార్థులకుగాను 6,457మంది హాజరు కాగా, 583 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. జనరల్ ఇంటర్మీడియెట్ ప్రవేశ పరీక్షకు 4,038 మందిలో 3,528 మంది హాజరుకాగా 510 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. ఐఐటి/నీట్ ఇంటర్మీడి యెట్ ప్రవేశ పరీక్షకు 2,831 మంది విద్యార్థులలో 2,374 మంది హాజరుకాగా, 457 మంది గైర్హాజరైనట్లు ఆమె తెలిపారు.

## నేరాల జోలికి వెళితే కట కటాల పాలే - రౌడీ షీటర్లకు పోలీసుల వార్నింగ్


రౌడీ షీటర్లకు క్లాస్ తీసుకుంటున్న పోలీసులు

అనంతపురం క్రైమ్ మార్చి 1, ప్రభాతవార్త

నేర ప్రవృత్తికి అలవాటు పడితే జైలు ఊచలు లెక్కపెట్టాల్సిందేనని అనంత పోలీసులు గట్టి వార్నింగ్ ఇచ్చారు. అనంతపురం జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్లల్లో పోలీసు అధికారులు రౌడీ షీటర్లు, ట్రబుల్ మాంగర్లకు తమదైన శైలిలో కొరడా ఝులిపించారు. జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా రౌడీషీటర్లకు పోలీసుల కౌన్సిలింగ్ ఇచ్చారు. నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా పోలీస్ అధికారులు రౌడీషీటర్లు, చెడు నడత కల్గిన వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. సి.ఐ లు, ఎస్సైలు విస్తృతంగా కౌన్సిలింగ్ చేపట్టారు. సత్ప్రవర్తనతో నడుచుకోవాలని తెలియజేశారు. నేరాలకు దూరంగా ఉండాలి, సత్ప్రవర్తనతో జీవించాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలలో పాల్గొంటే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవన్నారు. గంజాయి, మత్తుపదార్థాల వినియోగం లేదా రవాణా చేస్తే తీవ్ర చర్యలు తీసుకుంటామన్నారు. చెడు వ్యసనాలను మాని, మంచి నడవడికను అలవర్చుకోవాలని హితవు పలికారు. రౌడీషీటర్లపై, క్రైమ్ సస్పెక్ట్‌లపై పోలీస్ నిఘా నిరంతరం ఉంటుందని గుర్తు చేసారు. ఎటువంటి గొడవలు, నేరాలలో పాల్గొన్నా వెంటనే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## డిఏఆర్ మైదానంలో 5కె 10కె మారథాన్ : జిల్లా ఎస్పీ



5కె, 10కె అవగాహన మారథాన్ పరుగును ప్రారంభిస్తున్న దృశ్యం

బళ్ళారి,మార్చి 01 ప్రభాతవార్త :

సమాజంలో పెరుగుతున్న మాదకద్రవ్యాల వినియోగం,రోడ్డు ప్రమాదాలు మరియు సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నగరంలోని డిఏఆర్ మైదానంలో 5కె, 10కె అవగాహన మారథాన్ పరుగును నిర్వహించారు.ఈ కార్యక్రమానికి బళ్లారి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ డా.సుమన్ పెన్నేకర్ తెలిపారు. ఈ అవగాహన మారథాన్ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిం చబడుతుండగా, బళ్లారిలో మూడోసారి జరుగుతుండటం విశేషమన్నారు.ఈసారి వెయ్యికి పైగా మంది నమోదు చేసుకుని పాల్గొనడం ఆనందకర విషయమన్నారు. వృద్ధుల కోసం ప్రత్యేకంగా 2 కిలోమీటర్ల వాకథాన్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు.ఈ మారథాన్ ముఖ్య ఉద్దేశ్యం యువతను డ్రగ్స్‌కు దూరంగా ఉంచి, క్రీడలు మరియు ఆరోగ్యకరమైన జీవనశైలిపై ఆసక్తి పెంచడం అని తెలిపారు.అదేవిధంగా రోడ్డు భద్రతా నియమాల పాటింపు, మహిళలు- పిల్లల రక్షణ, సైబర్ నేరాలపై అప్రమత్తత కల్పించడం కూడా ఈ కార్యక్రమ లక్ష్యమని పేర్కొన్నారు .పరుగుపందెం ముగిసిన అనంతరం వివిధ విభాగాల్లో విజేతలకు ప్రశంసాపత్రాలు,హెల్మెట్లు మరియు పతకాలు అందజేశారు. ప్రజలు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.

**CHANGE OF NAME**

I, KUDERU AMEERF BASHA (old name) S/o. KUDERU ALIAKBAR, D.No.16-9, Rajaji Street, Anantapur - 515001, Anantapur Dt. A.P.State, changing my name from KUDERU AMEERF BASHA (old name) to **KUDERU AMEER BASHA** (new name). Hence forth, I am being **KUDERU AMEER BASHA** for all transactions.

**CHANGE OF NAME**

I, Mahaboob Bee Sayed (old name) Presently Residing at Plot No. 31-A, Shanvika Priya Town Ship, Akuthotapalli Village, Ananthapuramu Rural Mandal, Ananthapuramu District, AP PIN - 515003, I have changed my name from MAHABOOB BEE SAYED (old name) to **LAVANOOR SHAIK MAHABOOB BI** (new name). for all purposes W/o. **SAYED SHABBEER AHAMMAD.**

04ATP01_04ATP01.qxd 01-03-2026 PM 10:35 Page 1



## మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోండి నేడు కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

### - జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి - జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

అనంతపురం కలెక్టరేట్ మార్చి1 ప్రభాతవార్త

మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చు నన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. నేడు అనగా సోమవారం అనంతపురం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కా ర వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబం ధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకు రావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్స్ అప్‌లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురా వాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



జిల్లా కలెక్టర్ ఓ, ఆనంద్

## రూ.కోటితో గొల్లపల్లి ప్రజలకు రహదారి

### - రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి సవితమ్మ

గోరంట్ల, మార్చి 1 ప్రభాతవార్త

ఎన్నో ఏళ్లుగా ఆ గ్రామానికి సౌకర్యవంతమైన దారి లేక ఆ గ్రామ ప్రజలు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో మంత్రి సవితమ్మ చొరవ తీసుకొని కోటి రూపాయలకు పైగా నిధులు మంజూరు చేయించి నూతన రోడ్డు నిర్మాణానికి నాంది పలికారు. ఇందులో భాగంగా వేగంగా జరుగుతున్న పనులను మంత్రి పర్యవేక్షించారు.

ఈ నేపథ్యంలో ఆదివారం గోరంట్ల మండలంలోని వడిగే పల్లి పంచాయతీ పరిధిలోని గొల్లపల్లి గ్రామానికి నూతనంగా వేస్తున్న బీటీ రోడ్డు పనులను మంత్రితో పాటు స్థానిక సర్పంచు నరసింహమూర్తి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఆదినారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం, డీలర్ చంద్రశేఖర్‌లతో పాటు టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి నరేష్, స్టేట్ డైరెక్టర్ సోమశేఖర్, సుబ్బారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ బెల్లాలచెరువు చంద్ర, నిమ్మల విద్యా ధరణి, హరీష్‌రెడ్డి, ప్రతాప్‌నాయుడు, తదితరుల నేతృతంలో రోడ్డు పనుల ను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఆలయంలో ప్రత్యేక పూజ ల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మంత్రిని సన్మానిస్తున్న సర్పంచు



రోడ్డు పనులను పరిశీలిస్తున్న మంత్రి సవితమ్మ

## మహిళా సాధికారతతోనే సమాజ పురోగాభివృద్ధి సాధ్యం

### - జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్

శ్రీ సత్యసాయి జిల్లా, మార్చి 01, ప్రభాతవార్త ప్రతినిధి:

మహిళ సాధికారతతోనే సమాజ పురోగాభివృద్ధి సాధ్యమవుతుందని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్లు పేర్కొన్నారు. ఆదివారం పుట్ట పర్తిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్టీసీ బస్టాండ్ నుంచి గణేష్ కూడలి వరకు పుట్టపర్తి సబ్ డివిజన్, ఏ ఆర్ రిజర్వ్ పోలీస్ శాఖల ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వ హించారు. ఈ ర్యాలీ నందు కలెక్టర్ ఎస్పీ లతోపాటు అడిషనల్ ఎస్పీ అంకిత సురాన, ఆర్డిఓ సువర్ణ , డి.ఎస్.పి లు , ఐసిడిఎస్ పిడి, వివిధ కళాశాల విద్యార్థినీలు, మహిళలు పాల్గొన్నారు. ఉల్లాసంగా ఉత్సాహంగా జరిగిన ఈ సైకిల్ ర్యాలీ అనంతరం గణేష్ సర్కిల్లో నిర్వహించిన కార్యక్ర మంలో కలెక్టర్ మాట్లాడుతూ, అంతర్జాతీయ మహిళా వారోత్సవాలలో భాగంగా ఈ సైకిల్ ర్యాలీ నిర్వహించడం వెనుక ఒక ప్రత్యేకత ఉందన్నారు. సైకిల్ తొక్కడం వల్ల శారీరక దృఢత్వం తో పాటు మానసిక ప్రశాంతత కూడా చేకూరుతుందన్నారు. అదేవిధంగా సైకిల్ వచ్చిన తర్వాత ఎంతోమంది ఆడపిల్లలు స్వేచ్ఛగా పాఠశాలలకు వెళ్లి చదువుకోవడం ప్రారంభించారని గుర్తు చేశారు.

ఒక కుటుంబం లేదా ఒక వ్యక్తి ఉన్నత స్థాయికి ఎదగడంలో మహిళలు వెన్నెముకగా నిలిచి ప్రోత్సహి స్తున్నారని కొనియాడారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వాలు లేదా పోలీసు వ్యవస్థ మాత్రమే మహిళలకు రక్షణ ఇవ్వాలన్న ఆలోచన కాకుండా సమాజంలో మహిళల భద్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలన్నారు. మహిళా సాధికారతతోనే సమాజ అభివృద్ధి సాధ్యమవు తుందని తెలియ జేశారు. 2026 మహిళా దినోత్సవం మార్చి 8 సందర్భంగా గివ్ టు గెయిన్ అనే థీమ్‌తో ముందుకెళ్తున్నామన్నారు. సమాజం మహిళలకు ఏది ఇస్తుందో అది వారు తిరిగి సమాజానికి ఇస్తారని మహి ళలను మనం గౌర వించగలిగితే సమాజం మంచి భావాలతో మరింత ముందుకు వెళు తుందన్నారు. ఒక తండ్రి తన కుమార్తెకు విద్యను అందిస్తే ఆ కుమార్తె ఆ కుటుంబాన్ని ఉన్నత స్థానంలో నిలబెడు తుందన్నారు. మహి ళలకు శిక్షణ భద్రతపై అవగాహన కల్పిస్తే వారు పదిమందికి ఈ భద్రతా శిక్షణ పై అవగాహన పెంచుతారన్నారు. మహిళలపై జరిగే నేరాలను అరికట్టడంలో పోలీస్ శాఖ కట్టుబడి ఉందన్నారు. అడిషనల్ ఎస్పీ అంకిత సురాన మాట్లాడుతూ, సమాజంలో గౌరవం ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, కుటుంబ స్థాయి నుంచి బాలి కలకు సమాన హక్కులు అవకాశాలు కల్పి ంచాలన్నారు.

ఆర్డిఓ, పిడి మాట్లాడుతూ, మహిళలు భయపడకుండా ముందుకు రావాలని సమస్యలు ఎదు రైతే వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలని పిలుపు నిచ్చారు. మహిళా పోలీస్ సిబ్బందితోపాటు శక్తి టీమ్స్ ర్యాలీలో పాల్గొని మహిళల రక్షణ చట్టపరమైన అవగాహన అత్యవసర పరిస్థితి స్పందించే విధానాలపై తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐ సి డి ఎస్ పి డి ప్రమీల, పుట్టపర్తి డిఎస్పి విజయ్ కుమార్, ఏ ఆర్ డి ఎస్ పి శ్రీనివాసులు, ఆర్ ఐ వలి సి ఐ లు, సురేష్ , శ్రీనివాసులు, బొజ్జప్ప, మారుతి శంకర్, ఆర్ఎస్ఐలు మహిళా పోలీస్ సిబ్బంది పోలీస్ శక్తి టీమ్స్ అలాగే కళాశాల, పాఠశాలల విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్



సైకిల్ ర్యాలీని నిర్వహిస్తున్న దృశ్యం



మహిళా పోలీసులతో జిల్లా ఎస్పీ, అడిషనల్ ఎస్పీ, ఆర్డిఓ లు దృశ్యం

## అంగన్వాడీలకు న్యాయం చేసింది.. చేసేది సీఎం చంద్రబాబే

### మీ డిమాండ్ల పై అసెంబ్లీలో కూడా ప్రస్తావించానన్న ఎమ్మెల్యే సునీత

కనగానపల్లి మార్చి 1 ప్రభాతవార్త

అంగన్వాడీలకు మొదటి నుంచి న్యాయం చేసింది.. చేసేది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాత్రమేనని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. మండలంలోని నెమలివరం, పాతపాళ్యం గ్రామాల్లో ఆమె ఆదివారం పర్యటించారు. పలువురు నేతల ఇంట జరిగిన శుభకార్యాలలో ఆమె పాల్గొన్నారు. అనంతరం నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్లను పరిశీలించారు. అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు సమస్యలపై కూటమి ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. వారు ఇప్పటికే తన దృష్టికి అనేక సమస్యలు తీసుకొచ్చారని.. వాటిని అసెంబ్లీలో సైతం ప్రస్తుతం జరుగుతున్న బడ్జెట్ సమావేశాల్లో చర్చించినట్టు చెప్పారు. అంగన్వాడీ చరిత్రలో లేని విధంగా రెండు సార్లు వేతనా లు పెంచిన ఘనత సీఎం చంద్రబాబు నాయుడు కే దక్కుతుందన్నారు.

ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాల్లో తాగునీటి సౌకర్యాలు, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.86.68 లక్షలు విడుదల చేసి, ఒక్కో కేంద్రానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించిం దన్నారు. 58,204 మంది అంగన్వాడీ వర్కర్లు, సూపర్‌వైజర్లు, బ్లాక్ కోఆర్డినేటర్లకు రూ.75 కోట్ల వ్యయంతో 5జీ స్మార్ట్‌ఫోన్లు అందించిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 5వేల మినీ అంగన్వాడీ కేంద్రాలను పూర్తి స్థాయి అంగన్వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేస్తోందన్నారు. అంగన్వాడీలు ప్రతిపాదించిన డిమాండ్లలో 9 డిమాండ్లను ఇప్పటికే కూటమి ప్రభుత్వం పరిష్కరించిందని గుర్తు చేశారు. వేతనాల పెంపు అంశాన్ని కూడా వీలైనంత వరకు అమలు చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కూడా దృష్టిలో ఉంచుకుని వారి ఆందోళనలు విరమించాలని కోరారు. ప్రభుత్వం ఎప్పటికీ మీ పక్షాన ఉంటుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ యాతం పోతులయ్య, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

## ఈస్ట్ నర్సాపురం కుంటకు నీటి సరఫరాకు సహకారం అందించండి

### - బిజెపి మండల కన్వీనర్ బొమ్మన ఓబిరెడ్డి

శింగనమల, మార్చి 1 ప్రభాతవార్త

మండల పరిధిలోని ఈస్ట్ నర్సాపురంకుంటకు శింగనమల చెరువు నుంచి వృథాగా వెళ్తున్న నీటిని చిన్న కాలువల ద్వారా నీరు సరఫరా చేసేందుకు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సహకారం అందించాలని బిజెపి మండల కన్వీనర్ బొమ్మన ఓబిరెడ్డి కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపుకార్యాలయంలో రైతులు, బిజెపి మండల కన్వీనర్ బొమ్మన ఓబిరెడ్డి కలిసి వినతిపత్రం అందించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. గతంలో శింగనమల చెరువు ద్వారా ఈస్ట్ నర్సాపురంకుంటకు నీరు వచ్చే దని, ఈ నీటి ద్వారా పంటలు, పశుపోషణ చేసుకునేవారని అయితే కాల క్రమేనా కాలువలో మట్టి, రాళ్ల అడ్డుగాపడి నీరు రావడం ఆగిపోయిందన్నా రు. ప్రస్తుతం ఈస్ట్ నర్సాపురం, పెద్ద మట్లగొంది, గోవిందరా యునిపేట, సోదనపల్లి గ్రామ రైతులు సమిష్టిగా ఏర్పడి ఆర్థిక వనరులు సమకూర్చుకుని ఈస్ట్‌నర్సా పురం కుంటకు కాలువ పూడిక తీత పనులు చేస్తున్నారని, కావున జలవనరుల శాఖతో మాట్లాడి కాలవ పూడిక తీత విషయంలో తమకు సహకరి ంచాలని వారు కోరారు.

## భగవంతున్ని ఎత్తుకుపోయిన వారిని భగవంతుడు కూడా కాపాడలేడు

### - గణపయ్యను దొంగిలించిన దొంగలు ఎంతటివారినైనా వదిలే ప్రసక్తి లేదు - దేవాలయం దగ్గర గుంపులో ఉండి.. గుసగుసలు మాట్లాడినా క్షమించం - ఎమ్మెల్యే ఎంఎస్.రాజు

అగళి, మార్చి 1 ప్రభాతవార్త

పురాతన అగళి శంకరేశ్వరస్వామి దేవాలయం వద్ద పురాతన వినాయక గుడిలోని 700 ఏళ్ల నాటి దాదాపు 400 కెజిలు గల గణపయ్య విగ్రహాన్ని గుప్త నిధుల తవ్వకం దారులు దొంగిలించిన విషయం ఇప్పటికే వార్త దిన పత్రికలో అనేక కథనాలు వెలువడ్డాయి. అటు పేపర్లలో, టీవల్లో వస్తున్న కథనాలకు స్థానిక ఎమ్మెల్యే టిటిడి మెంబర్ ఎంఎస్.రాజు స్పందించి ఆదివారం దేవాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ముఖ్యంగా యువతతో ఎమ్మెల్యే మాట్లాడారు. ఇంతకు ముందు ఈ దేవాల యాల్లో తవ్వకాలు జరిగాయా అని ప్రశ్నించారు. ఇప్పటికే పోలీస్‌స్టేషన్‌లో గుప్త నిధుల తవ్వకం దారులపై రెండు కేసులు నమోదు అయ్యాయని గ్రామస్తులు తెలిపారు. గణపయ్యను దొంగిలించిన విషయం ఏమైనా ఆనవాలు బయట పడ్డాయా అని సిఐ రాజ్‌కుమార్‌ను ఎమ్మెల్యే అడుగగా బొలేరో వాహనం ఆ రాత్రి తిరిగినట్లు సిసి కెమెరాల్లోఉందని సిఐ తెలిపారు. దొంగలు ఎంతటి వారైనా వదలవద్దని సిఐకి ఎమ్మెల్యే సూచించారు. ఎంతో సెంటిమెంట్ తోకూడుకున్న ఆ విగ్రహాన్ని దోచిన వారు ఎవరైనా, ఏ స్థాయిలోఉన్నా వారిని వదిలే ప్రసక్తి లేదని గ్రామస్తులకు తెలిపారు. వీరి వెంట జడ్పిటిసి ఉమేష్, యజమాని సురేష్, కరణం ప్రకాష్, సింగిల్ విండో అధ్యక్షులు కుమారస్వామి, గౌడ్‌లు దేవరాజు, బాబు, శ్రీనివాస్, నాయకులు టిసి శివకు మార్, బసవరాజు, కన్వీనర్ తిప్పేస్వామి, బసవరాజు, నరసింహప్ప, షౌకతలి, రాజన్న, రమేష్, మల్లేష్, మారుతి, మల్లిక, లోకేష్, గ్రామస్తులు ఉన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్.రాజు

## విశ్వశాంతి కై ఏకాదశ రుద్ర పారాయణం

పుట్టపర్తి రూరల్ మార్చి 01 ప్రభాతవార్త:

విశ్వశాంతి కోసం,లోక క్షేమం కోసం ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటైన శ్రీశైలం పుణ్యక్షేత్రంలో ఏకాదశరుద్ర పారాయణం వైభవంగా జరిగింది. సత్యసాయి సేవా సంస్థలు ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ బృహత్తర కార్యక్రమానికి దేశ నలుమూలల నుండి 5వేలకు మందిపైగా భక్తులు పాల్గొన్నారు. 2025 ఏప్రిల్ లో ప్రారంభమైన గొప్ప కార్యక్రమం 26న శ్రీశైలంలో ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మేనేజింగ్ ట్రస్ట్ ఆర్జే రత్నాకర్, హిమ వాహిని దంపతులు పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం రత్నాకర్ మాట్లాడుతూ 1963 లో భగవాన్ సత్యసాయి బాబా వారు శ్రీశైల క్షేత్రాన్ని సందర్శించారన్నారు. ఆ సమయంలో స్వామి లింగంపై తుంగపూలు వర్షం పడేశారని అమ్మవారికి ప్రత్యక్ష హారం సృష్టించి ఇచ్చారని గుర్తు చేశారు. ఇటువంటి సౌకర్యాలు లేని ఆనాటి కాలంలో సంకల్ప మాత్రం చేత స్వామి శ్రీశైలం సందర్శించడం విశేషం అన్నారు. ఇంతకుముందు ఉదయం తెల్లవారు జామున చేశారు సత్య సాయి సేవ చేయాలని సభ్యులు నిర్వహించారు. ఈ కార్యక్రమం ఉత్తర ద్వార గోపురం పూర్ణకుంభాలతో హారతులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆల్ఇండియా జాతీయ అధ్యక్షుడు నిమిష్పాండే , రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణరావు, ఆలయ అధికారులు, సేవ సంస్థల పదాధికారులు పెద్ద సంఖ్యలో భక్తుల పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఆర్జే రత్నాకర్.



వేలాదిగా పాల్గొన్న సాయి భక్తులు

## మాట ఇచ్చాం నీళ్లు తెచ్చి తీరుతాం..!!

### - రైతుల పక్షాన అసెంబ్లీలో గళం వినిపించా - కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతి - ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గుంతకల్లు, మార్చి 1 ప్రభాతవార్త

ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు నియోజకవర్గంలోని 12 చెరువులకు నీళ్లు తెచ్చి తీరుతామని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఉద్ఘాటించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ముందు సిపిఐ ఆధ్వర్యంలో చేస్తున్న సామూహిక దీక్షలను ఎమ్మెల్యే ఆదివారం సందర్శించారు. మండల కార్యదర్శి రాము రాయల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రైతుల పక్షాన అసెంబ్లీలో గళం వినిపించానని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతిగా పనిచేస్తోందని పేర్కొన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా చెరువులకు నీళ్లు అందించి రైతులను ఆదుకుంటామన్నారు. అనంతరం నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపజేశారు. అంతకుముందు సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు దేవరగుడి జగదీష్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకొని పిల్ల కాలువల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయించాలని కోరారు. జూన్, జూలై మాసాల కంతా చెరువులకు నీళ్లు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు మండల ఇన్‌చార్జ్ గుమ్మనూరు నారాయణస్వామి, మార్క్ ఫెడ్ డైరెక్టర్ కెసి హరికుమార్, మండల కన్వీనర్ రామన్న చౌదరి, జెడ్‌పిటిసి కదిరప్ప, పాల మల్లికార్జున, తలారి మస్తానప్ప, సిపిఐ నాయకులు గోవిందు, వీరభద్రస్వామి, గౌస్, రామాం జనేయులు యాదవ్, దేవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

## పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకు స్థాపన చేసిన ఎంపీ బీకే పార్థ సారథి

పరిగి మార్చి 1 (ప్రభాతవార్త ):

పరిగి మండలం లో పలు అభివృద్ధి కార్యక్రమలకు హిందూపురం ఎంపీ బీకే పార్థ సారథి ఆదివారం భూమి పూజలు చేశారు.ధనాపురం హైవే నందు పార్లమెంట్ సభ్యుల నిధులు 5 లక్షల రూపాయలతో నూతన బస్ షెల్టర్ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమంలో పాల్గొని మరియు, పరిగి గ్రామంలోని వాల్మీకి విగ్రహం ఎదురుగా 5 లక్షల రూపాయలు ఎంపీ నిధులతో నూతన బస్సు షెల్టర్ నిర్మాణానికి భూమి పూజ తదనంతరం మండలంలో బిందు నగర్ లో ఎంపీ నిధులనుండి 12 లక్షల రూపాయలతో నూతన అయ్యప్ప స్వామి గుడి కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమి పూజ చేసిన హిందూపురం పార్లమెంట్ సభ్యులు బి కె.పార్థసారధి, యువ నాయకుడు బి కే.సాయి కళ్యాణ్ , ఈ కార్యక్రమాలలో టీడీపీ సీనియర్ నాయకులు కార్యకర్తలు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు



బస్సు షెల్టర్ నిర్మాణానికి భూమి పూజలో ఎంపీ

## కాకినాడ బాణసంచా పేలుడు ఘటన అత్యంత దురదృష్టకరం

### - మృతుల కుటుంబాలను ఆదుకోవాలి - బిజెపి జిల్లా గ్రంథాలయ కన్వీనర్ పోతుల గంగాధర్‌యాదవ్

తాడిపత్రిటౌన్, మార్చి 1 ప్రభాతవార్త

కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెం బాణసంచా తయారీ కేంద్రంలో శనివారం జరిగిన భారీ పేలుడు ఘటనపై భారతీయ జనతా పార్టీ నాయకులు, జిల్లా గ్రంథాలయ కన్వీనర్ పోతుల గంగాధర్‌యాదవ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో కార్మికులు మృతి చెందడం, అనేక మంది తీవ్రంగా గాయపడటం బాధాకరమన్నారు. పొట్టకూటి కోసం ప్రాణాలను పణంగా పెట్టి పనిచేస్తున్న నిరుపేద కార్మికుల భద్రత విషయ ంలో యాజమాన్యం, సంబంధిత ప్రభుత్వ అధికారులు పూర్తిగా విఫలమ య్యారని ఆరోపించారు. తరచూ ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నా, కనీస భద్రతా ప్రమాణాలు పాటించని యూనిట్లపై కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్లే అమాయకుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయన్నారు. ప్రమాదంలో మరణించిన కార్మికుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి మృతుల కుటుంబాలకు 25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. తీవ్రంగా గాయపడిన క్షత గాత్రులకు ప్రభుత్వ ఖర్చులతో కార్పొ రేట్ ఆసుపత్రులలో మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈ ఘటనపై ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించి, ప్రమాదానికి కారణమైన బాణసంచా తయారీ కేంద్రం యాజ మాన్యంపై, భద్రతా ప్రమాణాలను పర్యవేక్షించడం లో విఫలమైన సంబంధిత అధికారు లపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు.



పోతుల గంగాధర్‌యాదవ్

## 3న బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయం మూసివేత

తాడిపత్రిటౌన్, మార్చి 1 ప్రభాతవార్త

చంద్రగ్రహణం కారణంగా తాడిపత్రి పట్టణ సమీపంలోని పెన్నానది తీరాన వెలసిన బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయాన్ని ఈ నెల 3వతేదీ మంగళవారం ఉదయం 6 నుండి రాత్రి 9 గంటల వరకు మూసివేయనున్నారు. 4వతేదీ బుధవారం ఉదయం 6 గంటలకు సంప్రోక్షణ అనంతరం స్వామివారికి పూజలు నిర్వహించి తిరిగి భక్తులకు స్వామివారి దర్శనం కల్పించడం జరుగుతుందని ఆలయ ఇఒ రామాంజనేయులు, ఆలయ కమిటీ చైర్మన్ చంద్రమోహన్‌నాయుడు, కమిటి సభ్యులు చవ్వా రంగనాథరెడ్డి, అర్చకులు మహేష్‌శర్మ, రవిశర్మ, శంకరయ్యశర్మ, గిరిశర్మ, నందుస్వామి, రామకృష్ణశర్మలు తెలిపారు.



బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయం

## సమన్వయంతో బృందాలు లక్ష్యాన్ని సాధించాలి

### -నిర్లక్ష్యంగా వ్యహరిస్తే కఠిన చర్యలు తప్పవ్ - రెవెన్యూ,ఇంజనీరింగ్ అధికారులకు కమిషనర్ హెచ్చరిక

అనంతపురం మార్చి 01 ప్రభాతవార్త

సమన్వయంతో బృందాలు పనిచేసి నెలాఖరు లోపు పన్నుల వసూళ్ల లక్ష్యాన్ని అధిగమించాలని, నిర్లక్ష్యంగా వ్యహరిస్తే శాఖాపరమైన కఠిన చర్యలు తప్పవని రెవెన్యూ, ఇంజనీరింగ్ విభాగపు అధికారులను నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జస్వంత రావు హెచ్చరించారు. పన్ను వసూళ్లకు సంబంధించి ఆయన ఆదివారం సర్క్యులర్‌ను విడదల చేస్తూ నేటి నుంచి ఈ నెల 31వ తేదీలోపు రోజూ వారి పనితీరుపై ప్రత్యేక దృష్టి సారిస్తానని, ప్రతి స్వర్ణ వార్డు పరిధిలో సిబ్బంది పర్యటించి ప్రజలతో సఖ్యతగా వ్యహరించి పన్నులు చెల్లించేలా వ్యవహరించాలని సూచించారు. 50 డివిజన్ల పరిధిలోని 74 స్వర్ణవార్డుల పరిధిలో 59,650 అసిస్మెంట్స్ వున్నాయని, వీటి లక్ష్యం రూ. 64.74కోట్లు కావున ప్రతి రోజూ రూ.2కోట్లు వసూళ్లను టార్గెట్‌గా నిర్ణయించారు. అలాగే నీటి పన్నుకు సంబంధించి 35,131 అసిస్మెంట్స్ వుం డగా వీటి లక్ష్యం రూ.10.43 కోట్లు వుందని, ఇందుకు సంబంధించి రోజూ రూ. 32లక్షలు వసూళ్లుకు టార్గెట్ విధించారు. ఈ స్పెషల్ డ్రైవ్ పూర్తి చేయడానికి రెవెన్యూ అధికారులు లక్ష్మిదేవి, సుజాత, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు రఘునాథరెడ్డి, కుళ్లాయప్ప, చంద్రశేఖర్, పెద్దక్కతో స్వర్ణ వార్డుల అడ్మిన్‌లు, అమునిటీస్, ఫిట్టర్లు బృందాలుగా ఏర్పడి లక్ష్యాన్ని సాధించాలని ఆయన పేర్కొన్నారు.

## నూతన దంపతులను ఆశీర్వదించిన మంత్రి సవితమ్మ

### - టిడిపి నేత, మాజీ సర్పంచు నిడిమామిడప్ప ఇంట తేనీటి విందులో మంత్రి

గోరంట్ల, మార్చి 1 ప్రభాతవార్త

శుభకరమైన దాంపత్యంతో నిండు నూరేళ్లు సుఖశాంతులతో జీవించాలని నూతన దంపతులను ఆశీర్వదించారు రాష్ట్ర బిసి సంక్షేమ శాఖా మంత్రి సవితమ్మ. గోరంట్ల మండలంలోని రెడ్డిచెరువుపల్లి పంచాయతీ పరిధిలోని వడ్డిపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచు, మండల టిడిపి నేత నిడిమామిడప్ప కుటుంబంలో ఇటీవల జరిగిన వివాహ వేడుకల నేపథ్యంలో నూతన దంపతులైన మౌనిక, విష్ణువర్ధన్‌లను మంత్రి సవితమ్మ అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్ర మంలో మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి, జిల్లా ఉపా ధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి నరేష్, స్టేట్ డైరెక్టర్ సోమ శేఖర్, సుబ్బా రెడ్డి, డీలర్ రమణ, తదితరులు పాల్గొన్నారు.



నూతన దంపతులను ఆశీర్వదిస్తున్న మంత్రి

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ - ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల, మార్చి 1 ప్రభాతవార్త

జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపుకార్యాలయంలో శింగనమల ఎమ్మెల్య బండారు శ్రావణిశ్రీ నియోజకవర్గ పరిధిలోని పేదలకు మంజూరైన 31,29,350 సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆపద సమయంలో పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా ఉంటుందన్నారు.



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ